

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్ విషప్రచారం చేస్తున్నారని, గత వైసీపీ ప్రభుత్వం వేల కోట్ల బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వం పాత బకాయిలను దశలవారీగా చెల్లిస్తూ, విద్యార్థుల చదువులకు భరోసా కల్పిస్తోంది.

ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఎమ్మెల్సీ

శుక్రవారం 20.11.2026

INK OF TRUTH


జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 34 | సంచిక - 209 | www.journalistfile.com | పేజీలు 8 | వెల : రూ.5.00

ఆర్థిక ప్రాంతాలే అభివృద్ధికి బ్లూ ప్రింట్

● విశాఖ, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రణాళికలే బ్లూప్రింట్ ● పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు కార్యాచరణ ● అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం





అమరావతి, నవంబర్ 19 (జర్నలిస్ట్‌ఫైల్) : రాష్ట్ర సమగ్రాభివృద్ధికి రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల ప్రణాళికలు అభివృద్ధికి బ్లూప్రింట్ వంటివని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలపై అధికారులు రూపొందించిన ప్రణాళికలపై ముఖ్యమంత్రి ఒకేసారి సమీక్ష నిర్వహించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమీక్షలో రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు. ఈ మూడు ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేయడంతో పాటు, ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రణాళికల్లో ఎక్కడైనా లోటుపాట్లు ఉంటే గుర్తించి భర్తీ చేయాలని, వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పరిశ్రమలు రావడం, పెట్టుబడులు పెట్టడం మాత్రమే అభివృద్ధి కాదని.. వాటి ద్వారా రాష్ట్ర ప్రజల ఆదాయాలు పెరగాలని, జీవన ప్రమాణాలు మెరుగుపడాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రజలకు పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించి తలసరి ఆదాయాన్ని పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని... దానికి అనుగుణంగా అధికార యంత్రాంగం పని చేయాలన్నారు. ప్రతి ప్రాంతానికి ఉన్న ప్రత్యేకతలు, వనరులు, అవకాశాలను వినియోగించుకుంటూ రూపొందించిన అభివృద్ధి ప్రణాళికలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ అవసరమైన మేరకు మార్పులు చేయాలని సూచించారు. మూడు రీజియన్లల్లో జరుగుతున్న అభివృద్ధి, పెట్టుబడులు, ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మూడు ప్రాంతాల అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికల అమల్లో ప్రజా ప్రతినిధుల భాగస్వామ్యం కచ్చితంగా ఉండేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ప్రణాళికల అమల్లో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే... ఆ సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రతినిధుల సహకారం కూడా తీసుకుని ప్రభుత్వం యంత్రాంగం పని చేయాలని సూచించారు. అలాగే ఈ ప్రాజెక్టుల అమలుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియ చేయడంతోపాటు... వివిధ రూపాల్లో వారినీ భాగస్వాములను చేయాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సిటీ ఎకనమిక్ రీజియన్ స్కీం కింద 60 ప్రాజెక్టులకు సంబంధించి రూ. 9,180 కోట్లతో సిద్ధం చేసి

మిగతా 2లో...

పల్లెల్లో మోగిన ఎన్నికల నగారా

- మూడో విడత పంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్
- మూడు రోజులపాటు నామినేషన్ల స్వీకరణ
- డిసెంబరు 2న ఓటింగ్, ఓట్ల లెక్కింపు



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : రాష్ట్రంలో రెండో సాధారణ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా మూడో విడత ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, ఐఏఎస్ (రిటైర్డ్) గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్‌ను రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా, ఐఏఎస్ (రిటైర్డ్) విడుదల చేశారు. ఈ విడతలో రాష్ట్రంలోని 25 జిల్లాలకు చెందిన వివిధ రెవెన్యూ డివిజన్ల పరిధిలోని మండలాల్లో గ్రామ పంచాయతీ సర్పంచ్,

మిగతా 2లో...


ఎంపీపీ ఎన్నికలకు నేటితో ముగింపు

ఇప్పటికే 600 మండలాల్లో ఎన్నికలు పూర్తి

మిగిలిన 59 చోట్ల నేడు నిర్వహణ

ఉదయం 11 గంటలకు ఎన్నికల ప్రక్రియ

2 లో



దీర్ఘకాలిక పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'

- రాబోయే 20 ఏళ్ల ప్రణాళికలకు ఇదే ప్రాతిపదిక కావాలి
- వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పెట్టుబడులు పెంచండి
- ఉద్యోగుల వేతనాలు పెంచుతున్నారా? పరిశ్రమలకు ప్రధాని మోదీ ప్రశ్న

దిల్లీ (జర్నలిస్ట్‌ఫైల్): రాబోయే 20 ఏళ్లలో పరిశ్రమలు తీసుకునే ప్రతి దీర్ఘకాలిక పెట్టుబడి నిర్ణయంలోనూ 'ఇండియా ఫస్ట్' అనే సూత్రమే ప్రాతిపదికగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు నిచ్చారు. భారత్‌ను స్వయం సమృద్ధి దేశంగా తీర్చిదిద్దడంలో పారిశ్రామిక రంగం కీలక

మిగతా 3లో...

ప్రభుత్వాసుపత్రుల్లో రోబోటిక్ వైద్యం

- తొలుత విజయవాడలో రూ.45 కోట్లతో కేంద్రం
- విశాఖ, కర్నూలుకు విస్తరించనున్న సేవలు
- ఐవీఎఫ్, బోన్‌మారో మార్పిడి కేంద్రాల ఏర్పాటు
- ఆధునిక వైద్య సేవలకు రూ.1,011 కోట్ల ప్రతిపాదనలు



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్): అత్యంత ఆధునిక వైద్య సేవలను ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో అందుబాటులోకి తెచ్చేందుకు వైద్యారోగ్య శాఖ పరిశీలిస్తోంది. ముఖ్యంగా కొత్తగా ఐవీఎఫ్ కేంద్రాలు, బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలు, ఇతర ఆధునిక వైద్య సేవలను విస్తృతం చేసేందుకు రూ.1,011 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఇందులో ముఖ్యంగా రోబోటిక్ శస్త్రచికిత్సలను బోధనాసుపత్రుల్లో దశలవారీగా ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. తొలిదశలో విజయవాడ ప్రభుత్వ బోధనాసు పత్రిలో రూ.45 కోట్లతో రోబోటిక్ శస్త్ర చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, మలివిడతలో విశాఖ కేజీహెచ్, కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రుల్లోనూ రోబోటిక్ విధానాన్ని ప్రవేశపెట్టాలని భావిస్తోంది.

మంగళగిరిలోని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ప్రధాన కార్యాలయంలో గురువారం నాలుగు గంటలపాటు జరిగిన విస్తృతస్థాయి సమీక్షా సమావేశంలో బోధనాసుపత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాల కల్పన, నిర్మాణాల పురోగతి, ఇతర ముఖ్యాంశాలపై మంత్రి అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రూ.1,011 కోట్లతో అత్యాధునిక వైద్య సేవలు, ప్రత్యేక చికిత్సా కేంద్రాలు, వైద్య పరికరాలు, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ విష్ణువర్ధన్ వివరించారు.

ముఖ్యమైన ప్రతిపాదనలు :ప్రభుత్వ ఆసుపత్రుల్లో తొలిసారిగా ఐదు సంతాన

మిగతా 2లో...

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్ విషప్రచారం

- విద్యార్థుల భవిష్యత్తుతో వైసీపీ చెలగాటం
- ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్



అమరావతి (జర్నలిస్ట్‌ఫైల్) : రాష్ట్రంలో విద్యా వ్యవస్థ, విద్యా విధానం, ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి వైసీపీ నాయకత్వం మాట్లాడుతుంటే 'దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా' ఉందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అధికారంలో ఉన్నప్పుడు ఒకలా, అధికారం కోల్పోయాక ఏది పడితే అది మాట్లాడొచ్చనే ఒక వింత పోకడకు వైసీపీ నేతలు తెరలేపారు. ప్రజలు మిమ్మల్ని తిరస్కరించి, పదవి నుంచి దించేసిన సమయంలో రాష్ట్రంలో మీరు ఎన్నివేల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి వెళ్లారో ఒకసారి గుర్తు చేసుకోవాలి. గత ఐదేళ్ల పాలనలో విద్యా రంగాన్ని పూర్తిగా అస్తవ్యస్తం చేసి, విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసింది వైసీపీ ప్రభుత్వమే. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో పేద విద్యార్థులు తమ సర్టిఫికెట్లు కూడా తీసుకోలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాలేజీ యాజమాన్యాలను, తల్లిదండ్రులను వేధింపులకు గురిచేసి, ఇప్పుడు నీతులు చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.

విద్యా వ్యవస్థ నుంచి అభివృద్ధి పనుల వరకు ప్రతి రంగంలోనూ బకాయిలు పెట్టిన ఘనత గత వైసీపీ ప్రభుత్వానిదే : గత వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో చిన్న పిల్లల చదువుల నుంచి

మిగతా 3లో...

పరిషత్ పీఠాల్లో కూటమి ప్రభంజనం

- 93 శాతానికి పైగా మండలాల్లో కూటమి విజయం
- అధ్యక్ష స్థానాల్లో టీడీపీదే స్పష్టమైన ఆధిపత్యం
- 625 అధ్యక్ష, 600 ఉపాధ్యక్ష స్థానాలకు ఎన్నికలు పూర్తి
- ఉపాధ్యక్ష పదవుల్లో జనసేనకు 83 స్థానాలు

కులగణనకు వైకాపా మద్దతు

- ప్రత్యేక కాలమ్‌తో సమగ్ర కులగణన చేపట్టాలి
- కుటుంబాల ఆర్థిక స్థితిగతులకూ చోటివ్వాలి
- సంక్షేమ పథకాల అమలుకు కచ్చితమైన గణాంకాలు అవసరం
- కేంద్రానికి వైకాపా అధినేత జగన్ విజ్ఞప్తి

విశ్వశాంతికి త్రిశక్తి సంకల్పం

ఒకే వేదికపై ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్

రెండో ప్రపంచ యుద్ధం నాటి కూటమి ప్రస్తావన

అణ్వాయుధ నిరాయుధీకరణపై చర్చలు

ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకాలన్న ట్రంప్



షెన్‌జెన్: ప్రపంచ శాంతి, భద్రత, స్థిరత్వాల పరిరక్షణకు మూడు అగ్రరాజ్యాలు కలిసికట్టుగా పనిచేయాలని చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో గురువారం జరిగిన త్రైపాక్షిక సమావేశాన్ని ఆయన చారిత్రక

యాంటీబయాటిక్స్‌ను బాధ్యతాయుతంగా వినియోగించాలి



❍ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డా. ఆర్. వెంకట రమణ.

అమరావతి, నవంబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 18 నుండి 24వ తేదీ వరకు "ఒకే ఆరోగ్యం – ఒకే కార్యాచరణ" యాంటీమైక్రోబియల్ నిరోధకతను ఇప్పుడే నివారిద్దాం!" అనే నినాదంతో ప్రపంచ యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (వూవీ=) అవగాహన వారోత్సవాలను నిర్వహిస్తోందని పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్ డా. ఆర్. వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు.

నగరంలోని డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కార్యాలయంలో గురువారం వారోత్సవాల అవగాహన పోస్టర్స్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనుషులు, జంతువులు మరియు వ్యవసాయ రంగంలో యాంటీబయాటిక్స్‌ను అనుచితంగా, అధికంగా ఉపయోగించడం వల్ల సూక్ష్మజీవులలో నిరోధకత పెరిగి అంటువ్యాధులకు చికిత్స చేయడం కష్టతరమవుతోందని ఆయన పేర్కొన్నారు. ఈ వారోత్సవాల సందర్భంగా రాష్ట్ర నిఘా విభాగం (ఎస్ఎస్ యూ), సమగ్ర వ్యాధి నిఘా కార్యక్రమం (ఐడీఎస్పీ) ద్వారా ఆరోగ్య నిపుణులు, విద్యార్థులు, రైతులు మరియు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలందరూ అర్హత కలిగిన వైద్యుల సూచన మేరకే యాంటీబయాటిక్స్ వాడాలని, సూచించిన మోతాదు మరియు కాలవ్యవధిని పూర్తిగా పాటించాలనన్నారు, చేతుల పరిశుభ్రత పాటిస్తూ టీకాలు వేయించుకోవాలని ఆయన సూచించారు. అలాగే వైద్యుల సలహా లేకుండా సొంతంగా మందులు వాడటం, ఇతరుల ప్రిస్క్రిప్షన్లు లేదా మిగిలిపోయిన మందులు ఉపయోగించడం, సాధారణ జలుబు, ఫ్లూ వంటి వైరల్ ఇన్ఫెక్షన్లకు యాంటీబయాటిక్స్ వాడటం మరియు చికిత్సను మధ్యలో ఆపడం వంటివి చేయకూడదని స్పష్టం చేశారు. భవిష్యత్ తరాలకు ప్రాణరక్షక ఔషధాల ప్రభావాన్ని కాపాడటానికి ప్రజలందరూ యాంటీబయాటిక్స్‌ను బాధ్యతాయుతంగా వినియోగించాలని డాక్టర్ ఆర్. వెంకట రమణ ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

దావూద్ పాత అడ్డాపై బుల్డోజర్లు!



ముంబయి (జర్నలిస్ట్ ఫైల్): అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం ఒకప్పుడు నివసించిన పాత భవనంపై బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులు బుల్డోజర్లు నడిపించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య గురువారం కూల్చివేత పనులు ప్రారంభించారు. అయితే ఈ చర్య కొద్దిసేపటికే నిలిచిపోయింది. భవనం కూల్చివేతను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టిన బాంబే హైకోర్టు.. తదుపరి ఉత్తర్వులు ఇచ్చేవరకు పనులు నిలిపివేయాలని ఆదేశించింది. నవంబరు 25 వరకు యథాతథ స్థితి కొనసాగించాలని స్పష్టం చేసింది.

దావూద్ నివాసం ఇదే..

ముంబయిలోని భెండి బజార్ ప్రాంతం పక్కోడియా స్ట్రీట్‌లో హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా పేరుతో ఈ పాత భవనం ఉంది. 1970వ దశకంలో దావూద్ ఇబ్రహీం తన కుటుంబంతో కలిసి ఇక్కడే నివసించాడు. అండర్‌వరల్డ్‌లో తన కార్యకలాపాలు ప్రారంభించిన సమయంలో ఈ ప్రాంతాన్ని కీలక కేంద్రంగా ఉపయోగించుకున్నట్లు సమాచారం. 1986లో భారత్‌ను విడిచి వెళ్లే వరకు ముంబయిలో అతడి కార్యకలాపాలు కొనసాగాయి.

ప్రమాదకర భవనంగా గుర్తింపు కాలక్రమంలో ఈ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీని పరిస్థితిని పరిశీలించిన బీఎంసీ అధికారులు అత్యంత ప్రమాదకరమైన సీ-1 కేటగిరీగా గుర్తించారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కూల్చివేతకు శ్రీకారం చుట్టారు. భవనం చుట్టూ నీలిరంగు రేకులు ఏర్పాటు చేసి, పెద్ద సంఖ్యలో మున్సిపల్ సిబ్బంది, పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భారీ భద్రత మధ్య పనులు ప్రారంభించారు.

వక్ఫ్ ఆస్తి అంటూ అభ్యంతరంఈ కూల్చివేత చర్యను సవాలు చేస్తూ ఇద్దరు వ్యక్తులు బాంబే హైకోర్టును ఆశ్రయించారు. తాము హాజీ ఇస్మాయిల్ హాజీ హబీబ్ ముసాఫిర్‌ఖానా ట్రస్ట్ లబ్ధిదారులమని పిటిషన్‌లో పేర్కొన్నారు. 1864లో హాజీ యాత్రికుల విశ్రాంతి భవనంగా, మసీదు నిర్మాణం కోసం ఈ ఆస్తిని కేటాయించారని.. అందువల్ల ఇది వక్ఫ్ ఆస్తి అని వాదించారు.

భవనంలోని నివాసితులు ఖాళీ చేయాలంటూ బీఎంసీ జారీ చేసిన నోటీసులు, కూల్చివేత చర్యలు సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన ఆదేశాలకు విరుద్ధమని ఆరోపించారు. భెండి బజార్ ప్రాంత పునరాభివృద్ధిలో భాగంగా సైఫీ బుర్హానీ అప్‌లిఫ్ట్‌మెంట్ ట్రస్ట్ చేపట్టిన ప్రాజెక్టుతోనూ ఈ ఆస్తి వివాదం ముడిపడి ఉంది.

కోర్టు జోక్యంతో నిలిచిన పనులుపిటిషనర్ల వాదనలను పరిశీలించిన బాంబే హైకోర్టు ధర్మాసనం.. ఈ వ్యవహారంలో పలు వివాదాస్పద అంశాలపై పూర్తిస్థాయి విచారణ అవసరమని అభిప్రాయపడింది. మహేశ్ చంద్ర త్రిపాఠి, జస్టిస్ అద్వైత్ సేథ్నాతో కూడిన ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అప్పటికే బీఎంసీ అధికారులు కూల్చివేత పనులు ప్రారంభించారని మున్సిపల్ కార్పొరేషన్ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు.

ఆర్థిక ప్రాంతాలే అభివృద్ధికి బ్లూప్రింట్

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపాదనలను కార్యరూపం దాల్చేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

పోర్టు ఆధారిత పరిశ్రమలతో అభివృద్ధి : విశాఖపట్నం ఎకనమిక్ రీజియనల్ ప్రణాళికలో భాగంగా యాంకర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేస్తున్న ప్రాంతానికి విశాఖ బే-టెక్ సిటీ అని పేరు పెట్టారు. వివిధ పేర్లను పరిశీలించిన అనంతరం సీఎం చంద్రబాబు విశాఖ బే-టెక్ సిటీ పేరును ఖరారు చేశారు. హైదరాబాద్ నగరంలో సైబరాబాద్ పేరుతో ఓ నగరాన్ని అభివృద్ధి చేసినట్టుగానే బే-టెక్ సిటీ పేరుతో విశాఖకు అనుబంధంగా మరో నగరాన్ని అభివృద్ధి చేయాలని ఆదేశించారు. అలాగే వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో నగర మేయర్‌కు చోటు కల్పించాలని సీఎం సూచించారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో వివిధ విభాగాలకు సంబంధించి 167 ప్రాజెక్టులకు గానూ... 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చాయని సీఎం వివరించారు. విశాఖకు చెరో వైపు ఉన్న విజయనగరం, అనకాపల్లి వైపు అభివృద్ధి జరుగుతోందని... ఆ ప్రాంతాల్లో అవసరమైన మేరకు ముందుగానే భూమిని గుర్తించి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. అలాగే తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో భూ లభ్యత తక్కువగా ఉంటుందని... దీనివల్ల పారిశ్రామికాభివృద్ధికి కొంత ఇబ్బంది ఉందన్నారు. ఈ మేరకు ఈ జిల్లాల్లో కూడా ఏపీఐఐసీతో సమన్వయం చేసుకుని ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. దీనికోసం అవసరమైతే పాలసీ తీసుకురావాలని అధికారులకు సూచించారు. విశాఖలో ఏడాదిలోగా కన్వెన్షన్ సెంటర్ నిర్మాణం పూర్తి చేయాలని, తదుపరి సీఐఐ భాగస్వామ్య సదస్సును అందులోనే నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోర్టుల ఆధారిత ఆర్థిక వ్యవస్థకు విస్తృత అవకాశాలున్నాయని, పరిశ్రమలకు అవసరమైన లాజిస్టిక్స్, పోర్టులు, విమానాశ్రయాల అనుసంధానాన్ని మెరుగుపరిస్తే మరింత అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి పారిశ్రామిక ప్రాంతం వద్ద అవసరమైన నివాస, విద్య, వైద్యం, రవాణా సదుపాయాలతో టౌన్‌షిప్‌లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలోని 16 పట్టణాలను పారిశ్రామిక నగరాలుగా తీర్చిదిద్దాలని నిర్దేశించారు.

నాలెడ్జ్ పార్టనర్లుగా ప్రముఖ విద్యా సంస్థలు: తిరుపతి ఆర్థిక ప్రాంతాన్ని సాంకేతిక, పారిశ్రామిక, ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తిరుపతిని గ్లోబల్ సెమీ కండక్టర్ల డిజైన్ క్యాపిటల్‌గా తీర్చిదిద్దేందుకు అవసరమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఎలక్ట్రానిక్స్, స్పేస్, రోబోటిక్స్, డ్రోన్ల వంటి రంగాలకు అనుబంధంగా డిజైన్ పరిశోధన, అభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే ఆర్ అండ్ డీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. కొప్పర్తి, తిరుపతి, లేపాక్షి పారిశ్రామిక క్లస్టర్లను మరింత బలోపేతం చేయాలన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాల్లో ప్రధాన పరిశ్రమల ఏర్పాటుతో పాటు వాటికి అవసరమైన విడిభాగాలు, సేవలు అందించే ఎంఎస్ఎంఈలను కూడా అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. కేవలం భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయడం కాకుండా, వాటి చుట్టూ స్థానికంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమల నెట్‌వర్క్ ఏర్పడాలని చెప్పారు. ముఖ్యంగా పెద్ద పరిశ్రమలకు అనుసంధానించేలా ఎంఎస్ఎంఈలను ప్రోత్సహించాలని చెప్పారు. ప్రతి రంగానికి అవసరమైన పూర్తి ఎకోసిస్టమ్ అభివృద్ధి చేయాలన్నారు. పరిశ్రమల వ్యర్థాల్లోని విలువైన పదార్థాలను తిరిగి వినియోగంలోకి తీసుకొచ్చే అవకాశాలను పరిశీలించాలని, అరుదైన ఖనిజాల వ్యర్థాల నుంచి ఇతర అవసరాలకు ఉపయోగపడే పదార్థాలను వేరు చేసే సాంకేతికతపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. గ్రీన్ ఎనర్జీ, హార్టికల్చర్, ఖనిజ సంపద ఆధారంగా తిరుపతి ప్రాంతంలో కొత్త పెట్టుబడులకు అవకాశాలున్నాయని చెప్పారు. తిరుపతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో మొత్తంగా రూ. 9 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తే... అత్యధిక శాతం గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ. 5.70 లక్షల కోట్లు వచ్చాయని సీఎం చెప్పారు. రేర్ ఎర్త్ మినరల్స్ రంగంలో అపకాశాలు పుష్కలంగా ఉన్నాయని.. దీన్ని మాగ్నటిక్ క్లస్టర్ ఏర్పాటు చేయాలని సూచించారు. హార్టికల్చర్ హబ్ అభివృద్ధికి సంబంధించి వచ్చిన ప్రతిపాదనలను కార్యాచరణలోకి తీసుకురావాలని, మూడేళ్లలో లక్ష్యాలను సాధించేలా ప్రణాళిక రూపొందించాలన్నారు. పెట్టుబడులు ఏయే రంగాల్లో, ఏయే ప్రాంతాల్లో వస్తున్నాయో స్పష్టంగా గుర్తించి, లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు. శ్రీసిటీ వంటి పారిశ్రామిక కేంద్రాల అనుభవాన్ని వినియోగించుకోవాలని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అమరావతి ఎకనమిక్ రీజియన్లో ఆక్వా, కోకో, పామాయిల్



వంటి రంగాలు అతి పెద్ద ఆర్థిక చోదక శక్తులుగా ఉన్నాయని తెలిపారు. అమరావతి ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఇప్పటికే రూ. 4.65 లక్షల కోట్ల విలువైన 48 ప్రాజెక్టులు నడుస్తున్నాయని తెలిపారు. మచిలీపట్నం, రామాయపట్నం వంటి పోర్టులకు మంచి కనెక్టివిటీ అందిస్తే ఈ ప్రాంతం వేగంగా అభివృద్ధి చెందుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. అలాగే క్వాంటం రంగాన్ని అభివృద్ధి చేయడం ద్వారా అమరావతి రీజియన్ పరిధిలో పెద్ద ఎత్తున పెట్టుబడులు రావడానికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. క్వాంటం కారిడార్ గా అమరావతి అభివృద్ధి చెందుతుందన్నారు. క్వాంటం వ్యాలీతోపాటు... క్వాంటం మాన్యుఫ్యాక్చరింగ్ రంగానికి అమరావతి కేంద్రంగా మారుతుందనన్నారు. అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్, ఔటర్ రింగ్‌రోడ్ నిర్మాణాలు అభివృద్ధికి కేంద్రంగా ఉంటాయని పేర్కొన్నారు. మూడు ఆర్థిక ప్రాంతాలకు ప్రముఖ విద్యాసంస్థలను నాలెడ్జ్ పార్టనర్లుగా నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. తిరుపతి ప్రాంతానికి ఐఐటీ, అమరావతి ప్రాంతానికి బిట్స్ పిలానీ వంటి సంస్థలతో పాటు మూడు ప్రాంతాల్లోనూ ప్రముఖ విద్యాసంస్థల భాగస్వామ్యాన్ని తీసుకోవాలన్నారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, పరిశోధనా సంస్థల మధ్య నిరంతర అవగాహన, చర్చలు జరగాలని చెప్పారు. ఐఐటీయన్లు, పాన్ ఐఐటీ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

తీర ప్రాంతం... బుద్ధిస్ట్ సర్క్యూట్లతో టూరిజం అభివృద్ధి : అరకు, లంబసింగి వంటి పర్యాటక ప్రాంతాలకు సందర్శకులను ఆకర్షించేలా రహదారులు, వసతి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని సీఎం చంద్రబాబు చెప్పారు. వచ్చే సీఐఐ సదస్సు నాటికి వివిధ ప్రాంతాల నుంచి ప్రతినిధులను అరకు, లంబసింగి వంటి ప్రాంతాలకు తీసుకెళ్లాలని సూచించారు. తీర ప్రాంతాలను పరిశుభ్రంగా, సురక్షితంగా ఉంచుతూ బీచ్ రిసార్టులుగా అభివృద్ధి చేయాలన్నారు. సూర్యలంక, ఓడరేవు, చినగంజాం, నిజాం పట్నం, డిండి వంటి ప్రాంతాల్లో బీచ్, ఎకో టూరిజానికి అవకాశం ఉందని తెలిపారు. పర్యాటక అభివృద్ధి పేరుతో కాలుష్యానికి తావుండకూడదని స్పష్టం చేశారు. ఆధ్యాత్మిక పర్యాటకానికి ఉన్న అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని, శ్రీశైలం సహా ప్రముఖ ఆధ్యాత్మిక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని చెప్పారు.

నాగార్జునకొండ, అమరావతి ప్రాంతాలను అనుసంధానిస్తూ బౌద్ధ పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని సూచించారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి ప్రణాళికలు రచించి... ఆ మేరకు ఆ ప్రాంతాన్ని నోటిఫై చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సూర్యలంక, గండికోట ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి సమగ్ర మాస్టర్‌ప్లాన్లు రూపొందించాలని నిర్దేశించారు. ఇప్పటికే కుదిరిన అవగాహన ఒప్పందాలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా చూడాలని, పెట్టుబడుల గ్రౌండింగ్‌పై నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు. వీకెండ్ ఎకానమీపై దృష్టి పెట్టాలని... వాణిజ్య, పర్యాటక, వినోద కార్యకలాపాలను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో విశాఖ, తిరుపతి, అమరావతి ఎకనమిక్ రీజియన్లకు సంబంధించిన సీఈఓలు యువరాజ్, ముఖేష్ కుమార్ మీనా, సురేష్ కుమార్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

టెక్కలి నియోజకవర్గ అభివృద్ధికి నూతన సారథులు



కోటబొమ్మాళి నవంబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్) : టెక్కలి నియోజకవర్గంలో నాలుగు మండలాల పరిధిలో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యులు, మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీలు) గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల మండల పరిషత్ కార్యాలయాల్లో ప్రమాణ స్వీకార కార్యక్రమాలు ప్రశాంతంగా జరిగాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసి, నూతన ప్రజాప్రతినిధులు బాధ్యతలు చేపట్టడంతో ఆయా మండలాల్లో స్థానిక సంస్థల పాలనకు కొత్త అధ్యాయం ప్రారంభమైంది.

నూతన ఎంపీపీలుగా బాధ్యతలు స్వీకరణ : నందిగాం మండలం: పినకాన మోహిణి అజయ్ కుమార్, కోటబొమ్మాళి మండలం: తర్ర రామకృష్ణ,సంతబొమ్మాళి మండలం: సుగ్గు శాంతిస్వరూప్ రెడ్డి,టెక్కలి మండలం: బగాది రమా శేషగిరిరావు, ఇటీవల నిర్వహించిన ఎంపీటీసీ ఎన్నికల్లో టెక్కలి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ ఘన విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 78 ఎంపీటీసీ స్థానాలకు గాను 73 స్థానాలను టీడీపీ కైవసం చేసుకుంది. నాలుగు మండలాల పరిధిలో జడ్పీటీసీ స్థానాల్లోనూ అత్యధిక మెజార్టీతో విజయం సాధించింది. నాలుగు మండలాల్లోనూ ఎంపీపీ పదవులను దక్కించుకోవడంతో స్థానిక సంస్థల్లో పార్టీకి స్పష్టమైన ఆధిక్యత లభించింది.

మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వం.. అభివృద్ధికి బాటలు! : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు నాయకత్వంలో టెక్కలి నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో ముందుకు సాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర అభివృద్ధి కోసం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా టెక్కలి నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో మంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం, రైతులకు సాగునీటి వసతులు, రహదారుల అభివృద్ధి, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం పర్యవేక్షిస్తూ, ప్రతి గ్రామం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పనిచేస్తున్నారు.

కార్యకర్తలకు ఆత్మీయత.. నాయకులకు ప్రోత్సాహం.. ప్రజాసేవే లక్ష్యం! : మంత్రి అచ్చెన్నాయుడు నాయకత్వంలోని ప్రత్యేకత ప్రజలతో ఆయనకున్న అనుబంధం. ప్రతి కార్యకర్తను పేరుపెట్టి ఆప్యాయంగా పలకరిస్తూ, వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ, పార్టీ కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ ప్రాధాన్యతనివ్వడం ఆయన ప్రత్యేకశైలి. కార్యకర్తల కష్టాన్ని గుర్తించి ప్రోత్సహించడం, నాయకులు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ద్వారా పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నారు.

బాధ్యతల స్వీకారం.. అభివృద్ధికి మరో ముందడుగు! : నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ పనిచేయాల్సిన బాధ్యత ఉంది. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ తాగునీరు, రహదారులు, పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల అభివృద్ధికి కృషి చేయాలి. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి. మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మార్గదర్శకత్వంలో నూతన ప్రజాప్రతినిధులందరూ సమష్టిగా పనిచేస్తూ టెక్కలి నియోజకవర్గ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్తారనే ఆకాంక్ష వ్యక్తమవుతోంది. ప్రజలతో అనుబంధం.. కార్యకర్తలకు అండగా నాయకత్వం.. గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి.. మంత్రి అచ్చెన్నాయుడు నేతృత్వంలో టెక్కలి నియోజకవర్గంలో నూతన ప్రజాప్రతినిధుల బాధ్యతల స్వీకారంతో అభివృద్ధి ప్రస్థానంలో మరో ముందడుగు పడింది.

ప్రభుత్వాసుపత్రుల్లో రోబోటిక్ వైద్యం



(మొదటి పేజీ తరువాయి)

సాధ్యకేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. గుంటూరు, అనంతపురం, విజయనగరం, కాకినాడ, తిరుపతి బోధనాసుపత్రుల్లో వీటిని నెలకొల్పేందుకు రూ. 17.50 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు.

అరుదైన వ్యాధుల చికిత్స :విజయవాడ ప్రభుత్వ బోధనాసుపత్రిలో అరుదైన వ్యాధుల చికిత్స కోసం ప్రత్యేక అత్యుత్తమ వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. అంచనా వ్యయం రూ. 17 కోట్లు.

అవయవ మార్పిడి కేంద్రాలు : పలాసలోని కిడ్నీ పరిశోధన కేంద్రంతోపాటు 11 పాత ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రూ. 163.52 కోట్ల వ్యయంతో అవయవ మార్పిడి కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.

బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలు : రూ. 48 కోట్ల వ్యయంతో విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు బోధనాసుపత్రుల్లో బోన్ మేరో ట్రాన్స్‌ప్లాంట్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇవి కాకుండా వృద్ధుల వైద్య కేంద్రం, క్లినికల్ స్కిల్స్ అండ్ సిమ్యులేషన్ కేంద్రాలు, ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియాలజీ కేంద్రాలు, స్పీచ్ అండ్ హియరింగ్ ఈఎన్‌టీ కేంద్రం, సమగ్ర క్యాన్సర్ వైద్య కేంద్రాలు, ఇతర ఆధునిక సేవల కల్పన గురించి తయారు చేసిన ప్రతిపాదనలను మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు డీఎంఈ వివరించారు. రూ. 180 కోట్ల అంచనా వ్యయంతో స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ పబ్లిక్ హెల్త్ ఏర్పాటు అవసరం ఉందని పేర్కొన్నారు. రూ. 65 కోట్ల అంచనా వ్యయంతో ఐసీయూల బలోపేతానికి సంబంధించిన ప్రతిపాదనలను కూడా డీఎంఈ మంత్రి ముందు ఉంచారు. వీటిపై మంత్రి స్పందిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించి అవసరమైన నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

వెంటిలేటర్ల విషయంలో రాజీ పడొద్దు : రోగుల అవసరాలకు అనుగుణంగా ఐసీయూ పడకలు, వెంటిలేటర్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం ప్రతిపాదించిన 850 వెంటిలేటర్లకు అదనంగా ఇంకా ఎన్ని అవసరమో క్షేత్రస్థాయిలో గుర్తించాలని సూచించారు. రోగుల ప్రాణాల విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం చేశారు.

కేంద్ర అణుశక్తి శాఖ నుంచి నిధులు పొందేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలి : అనంతపురం, మచిలీపట్నం, విజయవాడ, శ్రీకాకుళం, ఒంగోలులో కలిపి ఐదు సమగ్ర క్యాన్సర్ వైద్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఒక్కో కేంద్రానికి రూ. 100 కోట్ల చొప్పున మొత్తం రూ. 500 కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఇందుకు అవసరమైన నిధులను కేంద్ర అణుశక్తి శాఖ నుంచి పొందేందుకు ప్రతిపాదనలు పంపాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులను ఆదేశించారు.

వైద్య కళాశాలలు, ఆసుపత్రుల ఆధునికీకరణ : వైద్య విద్యార్థులకు నాణ్యమైన శిక్షణ అందించడంతోపాటు కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్య కళాశాలల్లో నిర్మాణ పనులను వేగవంతం చేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. ఎంబీబీఎస్, పీజీ కోర్సుల నిర్వహణకు అవసరమైన భవనాలు, వైద్య పరికరాలను సిద్ధం చేయాలని సూచించారు. 11 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో పెండింగ్‌లో ఉన్న నిర్మాణాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పీజీ సీట్ల మంజూరుకు అనుగుణంగా ఈ ఆర్థిక సంవత్సరంలో విడుదలైన రూ. 343 కోట్లను త్వరగా వినియోగించి అవసరమైన పరికరాలను సమకూర్చాలని, నిర్మాణ పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రుల స్థాయి, రోగుల అవసరాలకు తగ్గట్టుగా సీటీ స్కాన్‌లు, క్యాథ్‌ల్యాబ్‌లు, ఎంఆర్ఐలు ఎక్కడెక్కడ కావాలో గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కూడా మంత్రి సత్యకుమార్ యాదవ్ అధికారులకు స్పష్టం చేశారు.

నాటి జగన్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పెరిగిన ఆర్థిక భారం: గత జగన్ ప్రభుత్వం ఆర్భాటంగా 17 కొత్త ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణాలను అవసరాల మేరకు చేపట్టకుండా బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిందని మంత్రి మండిపడ్డారు. అలాగే నాడు-నేడు కింద చేపట్టిన నిర్మాణాలను పూర్తి చేయకుండా గాలికొదిలేసిందని పేర్కొన్నారు. దీని వల్ల కూటమి ప్రభుత్వంపై ఆర్థిక భారం పెరిగిందన్నారు.

రూ.7,369 కోట్ల నిధుల సమీకరణకు ప్రతిపాదనలు : బోధనాసుపత్రుల్లో చేపట్టిన నిర్మాణాలు, ఇప్పటివరకు చేసిన వ్యయం, ఇంకా మంజూరు కావాల్సిన నిధుల వివరాలను ఏపీ వైద్య సేవలు, మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ చీఫ్ ఇంజినీర్ బలరామిరెడ్డి మంత్రికి వివరించారు. తొలి దశలో ప్రభుత్వ బోధనాసుపత్రుల్లో రూ. 2,340 కోట్లతో నిర్మాణాలు చేపట్టేందుకు ప్రతిపాదనలు అందినట్లు తెలిపారు. రాష్ట్రాలకు మూలధన పెట్టుబడుల కోసం ప్రత్యేక సహాయ పథకం (సాస్కీ) కింద వచ్చే రూ. 7,369 కోట్ల ఆర్థిక సహాయం పొందేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు డీఎంఈ విష్ణువర్ధన్ వివరించారు. 2027-28 ఆర్థిక సంవత్సరంలో రూ. 2,499.97 కోట్లతో ప్రభుత్వ బోధనాసుపత్రులను ఆధునికీకరించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్వహణ విషయంలో: గిరిజన ప్రాంతాల్లో వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రుల నిర్వహణ బాధ్యతలను అక్కడి భౌగోళిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని డైరె

కులగణనకు వైకాపా మద్దతు

అమరావతి: సమాజంలోని అన్ని వర్గాలకు సమాన అవకాశాలు కల్పించి, సామాజిక న్యాయం సాధించాలంటే సమగ్ర కులగణన తప్పనిసరని వైకాపా అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. జనగణన-2027లో కులాలవారీ జనాభా వివరాలను కచ్చితంగా నమోదు చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కచ్చితమైన గణాంకాల ఆధారంగానే సంక్షేమ పథకాల రూపకల్పన, నిధుల కేటాయింపు, అభివృద్ధి కార్యక్రమాల అమలు సాధ్యమవుతుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు.

సామాజిక న్యాయం అనేది కేవలం హామీలకే పరిమితం కాకూడదని, వాస్తవ పరిస్థితులు, కచ్చితమైన గణాంకాల ప్రాతిపదికన అమలు కావాలని జగన్ అభిప్రాయపడ్డారు. కులాలవారీ జనాభాతోపాటు ఆయా వర్గాల ఆర్థిక స్థితిగతులపై స్పష్టమైన సమాచారం అందుబాటులో ఉంటే ప్రభుత్వ విధానాల్లో పారదర్శకత పెరుగుతుందని పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత సమర్థంగా అమలు చేయడానికి వీలవుతుందని తెలిపారు.

సమగ్ర కులగణనకు వైకాపా మొదటి నుంచీ మద్దతు ఇస్తోందని జగన్ స్పష్టం చేశారు. ఈ డిమాండ్ సహేతుకమైనదని, ప్రభుత్వం దీనిపై తీవ్రంగా దృష్టి సారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. జనగణన-2027లో సమగ్ర కులగణనకు అవసరమైన ఏర్పాట్లు చేయడం ద్వారా అన్ని కులాల వాస్తవ జనాభా వివరాలు వెలుగులోకి వస్తాయని పేర్కొన్నారు.

జనగణన-2027లో ప్రత్యేక కుల కాలమ్, కులాల వివరాల కోసం సమగ్ర డ్రాప్‌డౌన్ మెనూ, కుటుంబాల ఆర్థిక స్థితిగతులను తెలిపే సూచికలను చేర్చాలన్న అఖిల భారత కులగణన సమన్వయ కమిటీ డిమాండ్లకు వైకాపా మద్దతు ప్రకటించింది. అందరినీ కలుపుకొనేలా కచ్చితమైన కులగణన చేపడితే ఆధారబద్ధమైన విధాన నిర్ణయాలు తీసుకోవడంతోపాటు సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేయవచ్చని జగన్ పేర్కొన్నారు.

సర్వీస్ ఛార్జీల వసూలుకు బ్రేక్!



న్యూఢిల్లీ: హోటళ్లు, రెస్టారెంట్లలో భోజనం చేసిన తర్వాత బిల్లులో అదనంగా కనిపించే సర్వీస్ ఛార్జీల వసూళ్లపై దిల్లీ హైకోర్టు కీలక స్పష్టత ఇచ్చింది. వినియోగదారుల అనుమతి లేకుండా బిల్లుల్లో సర్వీస్ ఛార్జీలను బలవంతంగా కలిపేందుకు రెస్టారెంట్లకు ఎలాంటి తాత్కాలిక వెసులుబాటు ఇవ్వలేదని తేల్చిచెప్పింది. ఈ ఛార్జీల వసూలును నిషేధిస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పు అమల్లోనే ఉంటుందని స్పష్టం చేసింది. దీంతో ఇష్టానుసారంగా సర్వీస్ ఛార్జీలు వసూలు చేస్తున్న రెస్టారెంట్లకు గట్టి ఎదురుదెబ్బ తగిలినట్లయింది.

సర్వీస్ ఛార్జీలపై దాఖలైన అప్పీళ్లను యాక్టింగ్ చీఫ్ జస్టిస్ నితిన్ వాసుదేవ్ సాంబ్రే, జస్టిస్ సంజయ్ శర్మలతో కూడిన ధర్మాసనం విచారించింది. కోర్టు ఆదేశాలను పక్కనపెట్టి కొన్ని రెస్టారెంట్లు ఇప్పటికీ బిల్లుల్లో సర్వీస్ ఛార్జీలను కలుపుతున్నాయని కేంద్ర ప్రభుత్వం తరఫు న్యాయవాది చేతన్ శర్మ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం.. రెస్టారెంట్ సంఘాలకు అనుకూలంగా తాము ఎలాంటి రక్షణ ఉత్తర్వులు ఇవ్వలేదని స్పష్టం చేసింది. సర్వీస్ ఛార్జీల వసూలుపై గతంలో ఇచ్చిన నిషేధ ఉత్తర్వులు కొనసాగుతాయని పేర్కొంది. నేషనల్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌ఆర్‌ఏఐ), ఫెడరేషన్ ఆఫ్ హోటల్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌హెచ్‌ఆర్‌ఏఐ) దాఖలు చేసిన అప్పీళ్లను విచారణకు స్వీకరించింది.

రెస్టారెంట్లు బిల్లుల్లో సర్వీస్ ఛార్జీలను ఆటోమేటిక్‌గా కలపకూడదని కేంద్ర వినియోగదారుల రక్షణ సంస్థ (సీసీపీఏ) 2022 జులైలో మార్గదర్శకాలు జారీ చేసింది. వినియోగదారుల అనుమతి లేకుండానే కొన్ని హోటళ్లు, రెస్టారెంట్లు 5 నుంచి 20 శాతం వరకు అదనపు ఛార్జీలు వసూలు చేస్తున్నాయంటూ ఫిర్యాదులు రావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. దీనిని సవాలు చేస్తూ రెస్టారెంట్ సంఘాలు న్యాయస్థానాన్ని ఆశ్రయించాయి. అయితే, వారి పిటిషన్లను 2025 మార్చి 28న సింగిల్ జడ్జి జస్టిస్ ప్రతిభా ఎం.సింగ్ కొట్టివేశారు.

మెనూ కార్డులో సర్వీస్ ఛార్జీ గురించి ప్రస్తావించినంత మాత్రాన వినియోగదారులు దాన్ని తప్పనిసరిగా చెల్లించాల్సిన అవసరం లేదని సింగిల్ జడ్జి స్పష్టం చేశారు. ఆ ఛార్జీ చెల్లించడం పూర్తిగా కస్టమర్ ఇష్టంపై ఆధారపడి ఉంటుందని పేర్కొన్నారు. అనుమతి లేకుండా అదనపు మొత్తాన్ని వసూలు చేయడం వినియోగదారుల హక్కులను ఉల్లంఘించడమేనని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంలో రెస్టారెంట్ సంఘాలకు రూ.లక్ష జరిమానా కూడా విధించారు. సర్వీస్ ఛార్జీ అనే పేరు వల్ల వినియోగదారులు దాన్ని ప్రభుత్వ పన్నుగా పొరబడే అవకాశం ఉందని వ్యాఖ్యానించారు.

మరోవైపు, గత 80 ఏళ్లుగా హోటల్ రంగంలో సర్వీస్ ఛార్జీల వసూలు అనవాయితీగా కొనసాగుతోందని రెస్టారెంట్ సంఘాలు తమ అప్పీళ్లలో వాదించాయి. ఆర్డర్ ఇచ్చే ముందే కస్టమర్లకు సమాచారం ఇచ్చి, మెనూలో స్పష్టంగా పేర్కొన్నప్పుడు ఛార్జీలు వసూలు చేసేందుకు అనుమతించాలని కోరాయి. ఈ మొత్తాన్ని యజమానులు తీసుకోరని, వెయిటర్లు, వంట సిబ్బంది సహా ఇతర ఉద్యోగులకు పంపిణీ చేస్తామని వివరించాయి. అమెరికా, బ్రిటన్, సింగపూర్, జపాన్ వంటి దేశాల్లోనూ ఇదే విధానం అమల్లో ఉందని పేర్కొన్నాయి. సింగిల్ జడ్జి తీర్పును రద్దు చేయాలని డివిజన్ బెంచ్‌ను అభ్యర్థించాయి.

తాజా పరిణామాలతో రెస్టారెంట్లు సర్వీస్ ఛార్జీల విషయంలో కోర్టు ఆదేశాలను తప్పనిసరిగా పాటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మరోవైపు, తమ వాదనలకు అనుకూలంగా తీర్పు పొందేందుకు రెస్టారెంట్ సంఘాలు తదుపరి ఎలాంటి న్యాయపోరాటం చేస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఈ అప్పీళ్లపై తుది విచారణలో వెలువడే తీర్పు కోసం అటు హోటల్ రంగం, ఇటు వినియోగదారులు ఎదురుచూస్తున్నారు. నిబంధనలు పక్కాగా అమలైతే అదనపు ఛార్జీల బాదుడు నుంచి సామాన్య కస్టమర్లకు గణనీయమైన ఊరట లభించనుంది.

అజిత్ డోభాల్‌కు సమన్లు చేరవేయండి

న్యూఢిల్లీ: దిల్లీ కోర్టు ద్వారా భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్, రా మాజీ చీఫ్ సామంత్ గోయల్ కు తమ సమన్లు అందజేయాలని అమెరికాలోని ఫెడరల్ కోర్టు అభ్యర్థించింది. ఖలిస్థానీ ఉగ్రవాది గురుపత్వంత్ సింగ్ పన్నూ దాఖలు చేసిన దావాపై విచారణకు సంబంధించి ఈ ఉత్తర్వులిచ్చింది.

"ఈ సివిల్ కేసులో ప్రతివాదులకు నోటీసులు అందించేందుకు భారత్‌లోని రిసీవింగ్ కోర్టు సహకరించాలని గౌరవపూర్వకంగా అభ్యర్థిస్తున్నాం" అని న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్ కోర్టు జడ్జి కేథరిన్ పొలాక్ ఫిల్లా పేర్కొన్నారు. భారత న్యాయస్థానాలతోనే ఈ సమన్లను వారికి పంపించాలన్నారు. ఇప్పటికే ఈ సమన్లను సదరు కోర్టు.. దిల్లీలోని పటియాలా హౌస్ కోర్టుకు పంపించింది.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై జగన్ విషప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

సాంకేతిక విద్య, ఆరోగ్యశ్రీ, రైతులు, కాంట్రాక్టర్ల వరకు అన్ని రంగాల్లో వేల కోట్ల రూపాయల బకాయిలు పెట్టి రాష్ట్రాన్ని అస్తవ్యస్తం చేసిందని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ విమర్శించారు.

గతంలో అమ్మఒడి (తల్లికి వందనం), సాంకేతిక విద్య, ఆరోగ్యశ్రీ పథకాలలో భారీగా బకాయిలు పెట్టారు. రాష్ట్ర అభివృద్ధి కోసం పనులు చేసిన కాంట్రాక్టర్లకు, గ్రామీణాభివృద్ధికి ఉపాధి హామీ నిధులతో పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులు పెట్టారు. పైగా, సీఎఫ్ఎంఎస్ అనే కొత్త విధానాన్ని అడ్డుపెట్టుకుని, కేవలం మీ మద్దతుదారులకు, మీకు అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే నిధులు మంజూరు చేసి నిబంధనలకు తిలోదకాలు ఇచ్చారు. గత ప్రభుత్వం పెట్టిన ఈ బకాయిలన్నింటినీ కూటమి ప్రభుత్వం భారం అనుకోకుండా తన బాధ్యతగా స్వీకరించింది. రైతులకు రావాల్సిన బకాయిలను చెల్లించడంతో పాటు, విద్యార్థుల చదువులకు ఎలాంటి ఆటంకం కలగకుండా పాత బకాయిలను దశలవారీగా తీరుస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో చదువుతున్నవిద్యార్థులకు ప్రతినెలా క్రమం తప్పకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తున్నాం. విద్యార్థులపై ఎలాంటి మానసిక, శారీరక ఒత్తిడి తీసుకురావద్దని, ఫీజుల విషయంలో ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తుందని కాలేజీ యాజమాన్యాలకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చాం. 2019-24 మధ్య కాలంలో ఎలాంటి మార్గదర్శకాలు లేకుండా ఫీజు ఫిక్సేషన్ కమిటీని ఏర్పాటు చేసి, మీకు అనుకూలమైన కాలేజీలకు ఫీజులు పెంచి,



మిగతా కాలేజీల్లో ఎన్ని సౌకర్యాలు ఉన్నాకనీస ఫీజును రూ. 35,000కు తగ్గించి కక్ష సాధింపులకు పాల్పడ్డారు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు సరైన విద్యా విధానం లేకుండా విద్యార్థి లోకాన్ని మోసం చేశారు.

పీజీ రీయింబర్స్‌మెంట్ కింద రూ. 450 కోట్లు బకాయి ఉంటే, కాలేజీ యాజమాన్యాలను పిలిచి 75 శాతం ఇస్తామని సంతకాలు తీసుకుని చివరకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసిన చరిత్ర మీది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాజకీయాలకు అతీతంగా అన్ని విద్యా సంస్థలను బతికించాలనే లక్ష్యంతో సగటు ఫీజును రూ. 45,000 కు సవరించింది. అంతేకాకుండా, ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద 2024-25లో రూ. 1,450 కోట్లు, 2025-26లో రూ. 1,666.21 కోట్లు, ప్రస్తుత 2026-27 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 1,845 కోట్లు.. వెరసి మొత్తం రూ. 4,962 కోట్లు కేటాయించి విద్యా రంగానికి అండగా నిలిచింది. కుల, మత, వర్గ, రాజకీయాలకు అతీతంగా ప్రతి యువకుడికి నాణ్యమైన సాంకేతిక విద్యను అందించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

ఊరికే బటన్లు నొక్కడం కాదు.. ఖాతాల్లో డబ్బులు పడాలి : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యా రంగానికి తీరని ద్రోహం జరిగిందని, ఊరికే బటన్లు నొక్కడం కాకుండా అర్హుల ఖాతాల్లో నిధులు జమ చేయడమే తమ ప్రభుత్వ చిత్తశుద్ధి అని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు.

మేము ఏదైతే చెప్తామో అదే చేస్తాం, చేసేదే చెప్తాం. కానీ గత ప్రభుత్వంలో అమ్మఒడి, ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన పేరుతో విద్యార్థి లోకాన్ని మోసం చేశారు. వసతి దీవెన కింద హాస్టళ్లకు బకాయిలు పెట్టడమే కాకుండా, కొన్ని చోట్ల మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా ఎత్తివేసి పేద విద్యార్థుల పొట్టకొట్టారు. ఫీజుల నిర్ధారణ (ఫీజ్ ఫిక్సేషన్), అడ్మిషన్ల ప్రక్రియను ఉద్దేశపూర్వకంగా అలస్యం చేయడం వల్ల మన రాష్ట్రవిద్యార్థులు ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది. మీ పిల్లలకు ఇంగ్లీష్ మీడియం కావాలి.. మా పిల్లలకు వద్దా?' అంటూ రాజకీయ లబ్ధి కోసం మాటలు చెప్పారే తప్ప, క్షేత్రస్థాయిలో సరైన అమలు లేకుండా చేశారు.

'నాడు-నేడు' పథకం కింద రూ. 4 వేల కోట్లు ఖర్చు చేశామని చెప్పుకున్నా, ఏ ఒక్క పాఠశాల కూడా పూర్తిస్థాయిలో, నాణ్యతతో నిర్మించలేదు. గుడి లాంటి బడుల నిర్మాణంలోనూ అవినీతికి పాల్పడి, ప్రధానోపాధ్యాయులపై తీవ్ర ఒత్తిడి తెచ్చి వారి ఆత్మహత్యలకు కారణమయ్యారు.

గతంలో 2014-19 మధ్య చంద్రబాబు నాయుడు గారి ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేశాం. గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, వైసీపీ పెట్టిన బకాయిలన్నింటినీ మా బాధ్యతగా స్వీకరించి సరిదిద్దుతున్నాం. సామాన్య పేద విద్యార్థి టెన్త్ క్లాస్‌లో మెరిట్ సాధిస్తే వారి ఫోటోలను పత్రికల మొదటి పేజీలో ప్రచురించి ప్రోత్సహించే విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రస్తుత ప్రభుత్వంలో ప్రైవేట్ విద్యాసంస్థలన్నింటినీ ఒకే రీతిలో చూస్తూ, వాటి సమస్యలను పరిష్కరిస్తున్నాం. ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో ఒకటి రెండు రోజులు అటుఇటు అయినా ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహిస్తుందని కాలేజీ యాజమాన్యాలకు భరోసా ఇస్తున్నాం. ముఖ్యంగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గారు ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకుని విద్యార్థులకు, యాజమాన్యాలకు అండగా నిలుస్తున్నారు. వైసీపీ నేతలు ఇప్పటికైనా ముసలి కన్నీరు కార్చడం, మోసపూరిత మాటలతో ప్రజలను భ్రమలకు గురిచేయడం మానుకోవాలి. రాష్ట్ర అభివృద్ధికి, విద్యా వ్యవస్థకు అడ్డుపడాలని చూస్తే నష్టపోయేది మీరేనని ఆలపాటి రాజేంద్రప్రసాద్ హెచ్చరించారు.

విశ్వశాంతికి త్రిశక్తి సంకల్పం

(మొదటి పేజీ తరువాయి)

మైలురాయిగా అభివర్ణించారు. ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో చైనా, అమెరికా, రష్యా పరస్పర సహకారంతో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. మానవాళి పురోగతికి, ప్రపంచ శాంతి పరిరక్షణకు ఉమ్మడిగా కృషి చేయాలని కోరారు.

రెండో ప్రపంచ యుద్ధం నాటి కూటమి స్ఫూర్తితో.. : ఎనిమిది దశాబ్దాల క్రితం మూడు దేశాల మధ్య ఉన్న ఉమ్మడి చరిత్రను షీ జిన్‌పింగ్ గుర్తుచేశారు. సుమారు 80 ఏళ్ల క్రితం ఫాసిస్టు వ్యతిరేక కూటమికి మద్దతుగా మూడు దేశాలు కలిసి పోరాడి గొప్ప విజయాన్ని సాధించాయని పేర్కొన్నారు. ఆ క్రమంలో ప్రపంచ శాంతిని కాపాడగలిగాయని వివరించారు. నాటి చారిత్రక అనుభవాలను గుర్తుంచుకోవాలని, గతం నుంచి పాఠాలు నేర్చుకుంటూ భవిష్యత్తును నిర్మించుకోవాలని సూచించారు. ప్రపంచ శాంతి, భద్రతల పరిరక్షణలో ప్రధాన శక్తులుగా మూడు దేశాలపై ప్రత్యేక బాధ్యత ఉందన్నారు.

విభేదాలున్నా చర్చలు ఆపొద్దు: ట్రంప్ : ప్రపంచ సవాళ్లపై చర్చల మార్గాలను తెరిచి ఉంచాల్సిన బాధ్యత ప్రధాన శక్తులపై ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. చైనా, రష్యా అధినేతలతో జరిగిన ఈ త్రైపాక్షిక భేటీని దౌత్యపరమైన ఏకాకితనానికి భిన్నమైన విధానంగా అభివర్ణించారు. ప్రపంచంలోని మూడు అతిపెద్ద దేశాల నాయకులుగా తమ ప్రజలకే కాకుండా యావత్ ప్రపంచానికి ప్రభావం చూపే అంశాలపై గౌరవప్రదమైన చర్చలు జరపాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు.

గతంలో విభేదాలున్న దేశాల నాయకులు పరస్పరం చర్చలకు దూరంగా ఉండేవారని ట్రంప్ వ్యాఖ్యానించారు. ప్రత్యర్థులతో మాట్లాడేందుకు నిరాకరించడం వల్ల ఏ సమస్యా పరిష్కారం కాలేదన్నారు. వివాదాలకు ముగింపు



పలకాలంటే ప్రత్యక్ష చర్చలు, పరస్పర సంభాషణలు అవసరమని స్పష్టం చేశారు. అణ్వాయుధ నిరాయుధీకరణ అంశంపైనా సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు. అయితే అణ్వాయుధాలు కలిగిన దేశాలను వాటిని వదులుకునేలా ఒప్పించడం అంత సులభం కాదన్నారు.

రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి పరిష్కారం లభించే అవకాశాలున్నాయని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఒక ఒప్పందం దిశగా సానుకూల పరిణామాలు మొదలయ్యాయని పేర్కొన్నారు. ఇరు దేశాలూ యుద్ధానికి ముగింపు పలకాలని కోరుకుంటున్నాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. ఈ అంశంపై రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో ఇప్పటికే సుదీర్ఘంగా ద్వైపాక్షిక చర్చలు జరిపినట్లు వెల్లడించారు.

ప్రపంచాన్ని మరింత సురక్షితంగా తీర్చిదిద్దేందుకు కొత్త మార్గాలను అన్వేషించడమే తన లక్ష్యమని ట్రంప్ పేర్కొన్నారు. అణ్వాయుధ వ్యాప్తి ముప్పును ఎదుర్కోవడంలో మూడు దేశాల మధ్య సహకారం కీలకమన్నారు. ఇరాన్ అణ్వాయుధాలను కలిగి ఉండటాన్ని అనుమతించబోమని స్పష్టం చేశారు. జాతీయ సార్వభౌమాధికార పరిరక్షణకు ఉమ్మడి చర్యలు అవసరమన్నారు. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు (ఐసీసీ) తన పరిధిని మించి వ్యవహరిస్తోందని ఆరోపించారు. పుతిన్‌పై అరెస్టు వారెంట్ జారీ చేసిన ఐసీసీ వ్యవహారశైలిని ఎదుర్కోవడంలో మూడు అగ్రరాజ్యాలు కలిసి పనిచేయాలని అభిప్రాయపడ్డారు.

ఆర్థిక సంబంధాలు, ఆహార, ఇంధన భద్రత, ఉగ్రవాద వ్యతిరేక చర్యల్లో మూడు దేశాల మధ్య పరస్పర సహకారం అవసరమని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ పేర్కొన్నారు. ఉక్రెయిన్ యుద్ధంతోపాటు వివిధ ప్రాంతీయ వివాదాల పరిష్కారంలో మూడు దేశాలకు ఉమ్మడి ప్రయోజనాలున్నాయని తెలిపారు. మాస్కో, బీజింగ్, వాషింగ్టన్ మధ్య పరస్పర గౌరవం, సమతుల్య ప్రయోజనాలతో కూడిన నిర్మాణాత్మక సహకారం ప్రపంచ స్థిరత్వాన్ని బలోపేతం చేస్తుందని చెప్పారు.

అంతర్జాతీయ ఉగ్రవాదం, సరిహద్దులు దాటిన వ్యవస్థీకృత నేరాలు వంటి సవాళ్లను ఎదుర్కోవడంలోనూ మూడు దేశాలకు ఉమ్మడి ఆసక్తి ఉందని పుతిన్ వివరించారు. ఆర్థిక, భద్రతా రంగాల్లో పరస్పర సహకారాన్ని విస్తరించడం ద్వారా అంతర్జాతీయ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవచ్చని అభిప్రాయపడ్డారు.

పరిషత్ పీఠాల్లో కూటమి ప్రభంజనం



అమరావతి: మండల పరిషత్ పీఠాలపై అధికార కూటమి పార్టీలు ఆధిపత్యం చాటుకున్నాయి. అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికల్లో 93 శాతానికి పైగా స్థానాలను కైవసం చేసుకుని విజయభేరి మోగించాయి. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ తిరుగులేని ఆధిక్యాన్ని ప్రదర్శించింది. మొత్తం 659 మండల ప్రజా పరిషత్‌లకు గాను గురువారం 625 చోట్ల అధ్యక్షులు, 600 చోట్ల ఉపాధ్యక్షులు ఎన్నికయ్యారు. అధ్యక్ష స్థానాల్లో టీడీపీ 85 శాతానికి పైగా, ఉపాధ్యక్ష స్థానాల్లో 74 శాతానికి పైగా స్థానాలను దక్కించుకుంది.

రాష్ట్ర ఎన్నికల సంఘం గురువారం సాయంత్రం పార్టీల వారీగా ఎన్నికైన వారి వివరాలను వెల్లడించింది. అధ్యక్ష స్థానాల్లో టీడీపీ 533 చోట్ల విజయం సాధించి అగ్రస్థానంలో నిలిచింది. జనసేన 42, వైఎస్సార్‌సీపీ 39, భాజపా 7, సీపీఎం ఒకటి, స్వతంత్రులు 3 స్థానాలను కైవసం చేసుకున్నారు.

ఉపాధ్యక్ష ఎన్నికల్లోనూ టీడీపీ హవా : ఉపాధ్యక్ష పదవుల ఎన్నికల్లోనూ కూటమి ఆధిపత్యం కొనసాగింది. టీడీపీ 445 స్థానాలను గెలుచుకోగా.. జనసేన 83, వైఎస్సార్‌సీపీ 40, భాజపా 20, స్వతంత్రులు 9, సీపీఎం 3 స్థానాలను దక్కించుకున్నాయి. ఈ ఫలితాలతో మండల పరిషత్‌లలో కూటమి బలం స్పష్టమైంది.

రాష్ట్రంలోని మొత్తం 659 మండల ప్రజా పరిషత్‌లకు గాను 34 చోట్ల అధ్యక్ష ఎన్నికలు, 59 చోట్ల ఉపాధ్యక్ష ఎన్నికలు ఇంకా జరగాల్సి ఉంది. దీంతో అధ్యక్ష ఎన్నికల ప్రక్రియ 625 చోట్ల, ఉపాధ్యక్ష ఎన్నికల ప్రక్రియ 600 చోట్ల పూర్తయినట్లయింది. రాష్ట్రంలోని 28 జిల్లాల ఫలితాలను పరిశీలిస్తే రెండు పదవుల్లోనూ టీడీపీ ఆధిక్యం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖ్యంగా శ్రీకాకుళం, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో అధ్యక్ష స్థానాల్లో టీడీపీ గణనీయమైన విజయాలు సాధించింది.

దీర్ఘకాలిక పెట్టుబడుల్లో 'ఇండియా ఫస్ట్'


(మొదటి పేజీ తరువాయి)

పాత్ర పోషించాలని సూచించారు. వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో పెట్టుబడులను గణనీయంగా పెంచాలని కోరారు. దేశాభివృద్ధికి ఇంకా ఎలాంటి సంస్కరణలు అవసరమో ఎలాంటి సంకోచం లేకుండా నేరుగా తనకు తెలియజేయాలని పరిశ్రమల ప్రతినిధులకు సూచించారు.

దిల్లీలో జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశం, వార్షిక సదస్సులో మోదీ పాల్గొని ప్రసంగించారు. 2047 నాటికి అభివృద్ధి చెందిన భారత్ లక్ష్య సాధన, ఆర్థికాభివృద్ధి, పారిశ్రామిక వృద్ధి, అంతర్జాతీయ మార్కెట్లో దేశ స్థానం తదితర అంశాలపై మాట్లాడారు. పరిశ్రమలు, రైతులు, చిన్న వ్యాపారులు, సంపద సృష్టికర్తలు, పన్నులు చెల్లించేవారికి తగిన గౌరవం లభించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

స్వదేశీ వస్తువుల వినియోగం, స్వయం సమృద్ధిపై మహాత్మాగాంధీ 1930లో ఇచ్చిన సందేశాన్ని ప్రధాని గుర్తుచేశారు. దాదాపు వందేళ్లు గడిచినా దేశం ఇంకా అదే సందేశాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు. పారిశ్రామిక రంగం స్వదేశీ ఉత్పత్తులకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దేశీయంగా తయారయ్యే వస్తువుల నాణ్యతను పెంచి అంతర్జాతీయ మార్కెట్లలో పోటీపడే స్థాయికి తీసుకెళ్లాలని కోరారు.

గత ప్రభుత్వాల హయాంలో పరిశ్రమలకు ఎదురైన అనుభవాలు చేదుగా ఉండేవని మోదీ వ్యాఖ్యానించారు. ఆ ప్రభావం ఇప్పటికీ పరిశ్రమలకు, ప్రభుత్వానికి మధ్య సంబంధాలపై కనిపిస్తోందన్నారు. అయితే ఇది గత



ప్రభుత్వాల తరహాలో వ్యవహరించే పాలన కాదని, పరిశ్రమలను మిత్రులుగా భావించే ప్రభుత్వమని స్పష్టం చేశారు. దేశాభివృద్ధికి అవసరమైన మార్పులు, సంస్కరణలపై పరిశ్రమల ప్రతినిధులు బహిరంగంగా తమ అభిప్రాయాలు వెల్లడించాలని కోరారు. ఎలాంటి భయం, సంకోచం లేకుండా తనకు నేరుగా లేఖలు రాయవచ్చని తెలిపారు. పరిశ్రమల సూచనలను స్వీకరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

వ్యవసాయ, అనుబంధ రంగాల్లో పెట్టుబడులను పెంచాల్సిన అవసరం ఉందని ప్రధాని పేర్కొన్నారు. అంతర్జాతీయ మార్కెట్లలో భారతీయ ఉత్పత్తులకు ఉన్న డిమాండ్‌ను గుర్తించి, అందుకు అనుగుణంగా ఉత్పత్తులు తయారు చేయాలని పరిశ్రమలకు సూచించారు. వివిధ దేశాల అవసరాలకు అనుగుణంగా రైతుల నుంచి పంటలను సేకరించే పటిష్ఠ వ్యవస్థలను ఏర్పాటు చేయాలన్నారు. దీనివల్ల రైతులకు గిట్టుబాటు లభించడంతోపాటు భారతీయ ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లో గుర్తింపు పెరుగుతుందని వివరించారు.

ఔషధ తయారీ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోవాలని మోదీ సూచించారు. ప్రపంచానికి మందులు సరఫరా చేసే దేశంగా భారత్ గుర్తింపు పొందినప్పటికీ, ఔషధాల తయారీలో ఉపయోగించే కీలక ముడి పదార్థాలు, యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియెంట్స్ (ఏపీఐలు), బల్క్ డ్రగ్స్, ఇతర మధ్యవర్తి పదార్థాలను భారీగా దిగుమతి చేసుకుంటున్నామని గుర్తుచేశారు. వీటిలో ఏయే పదార్థాలను దేశీయంగా తయారు చేయవచ్చో పరిశ్రమలు గుర్తించాలని కోరారు. ఆధునిక సాంకేతికత, భారీ ఉత్పత్తి కేంద్రాల ఏర్పాటుపై పెట్టుబడులు పెట్టాలని సూచించారు. దిగుమతులపై ఆధారపడటం తగ్గితే ఔషధ రంగంలో భారత్ మరింత బలోపేతమవుతుందని పేర్కొన్నారు.

పన్నుల విధానంలో ప్రభుత్వం తీసుకొచ్చిన సంస్కరణలను ప్రధాని ప్రస్తావించారు. 2014లో 30 శాతంగా ఉన్న ప్రాథమిక కార్పొరేట్ పన్ను రేటును 22 శాతానికి తగ్గించినట్లు తెలిపారు. వ్యక్తిగత ఆదాయపు పన్ను విధానంలోనూ మార్పులు తీసుకొచ్చామని, కొత్త పన్ను విధానంలో ఏడాదికి రూ.12 లక్షల వరకు ఆదాయంపై పన్ను భారం లేకుండా చేశామని వివరించారు. పన్ను రిటర్నుల దాఖలు, వాపసు ప్రక్రియలను సరళీకరించామన్నారు. గతంలో పన్ను వాపసు పొందడానికి నెలల సమయం పట్టేదని, ప్రస్తుతం చాలా సందర్భాల్లో వారంలోపే అందుతోందని తెలిపారు.

అయితే ప్రభుత్వం కార్పొరేట్ పన్నులను తగ్గించినప్పుడు పరిశ్రమలు తమ ఉద్యోగుల సంఖ్యను పెంచాయా? వారి వేతనాలను పెంచాయా? అని ప్రశ్నించారు. పన్ను రాయితీల ద్వారా కలిగిన ప్రయోజనాలు ఉద్యోగులకు, దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా అందాలని సూచించారు.

గత వందేళ్లలో భారత ఆర్థిక వ్యవస్థ అనేక ఒడుదొడుకులను ఎదుర్కొందని మోదీ పేర్కొన్నారు. లైసెన్స్ కోటా రాజ్, జాతీయీకరణ విధానాల నుంచి ఒక దశలో ప్రపంచంలోని బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా గుర్తింపు పొందిన పరిస్థితులను ప్రస్తావించారు. అయితే గత 12-13 ఏళ్లలో ప్రజలు, రైతులు, యువత,

సర్వజ్ఞ విద్యార్థుల విశేష ప్రతిభ

- వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచి ప్రతిభా పురస్కారాలు కైవసం



ఖమ్మం, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :

సర్వజ్ఞ పాఠశాల విద్యార్థులు వివిధ స్థాయిలలో నిర్వహించిన సాంస్కృతిక, శాస్త్రీయ, అవగాహన పోటీలలో తమ అసాధారణ ప్రతిభను కనబరిచి బహుమతులు, ప్రశంసా పత్రాలు సాధించారని పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్, డైరెక్టర్ కె. నీలిమ తెలిపారు. భక్త రామదాసు కళాక్షేత్రంలో నిర్వహించిన 'బాలోత్సవ్-2026' పోటీలలో సర్వజ్ఞ విద్యార్థులు ఘన విజయం సాధించారు. జానపద నృత్యం విభాగంలో 6వ తరగతి విద్యార్థిని బి. కార్తిక సాన్వి అత్యుత్తమ ప్రదర్శన కనబరచగా, గ్రూప్ డాన్స్ విభాగంలో పాల్గొన్న సర్వజ్ఞ విద్యార్థుల బృందం విజేతగా నిలిచి విన్నర్స్ షీల్డ్ ను కైవసం చేసుకుంది. గ్రూప్ డాన్స్‌లో ప్రతిభ చూపిన ఎస్. శరణ్య, జి. అన్విక, ఎ. గగన , ఎమ్. సమన్వి , బి. జితీషి , సిహెచ్. గీత లహరి , జి. చిన్మయి, బి. రక్షిత, బి. గౌరి, సి. మౌల్య, బి. హేతన, ఎస్.కె. అఫ్సా, ఎమ్. అక్షిత, బి. నేహా మాధురి, వై. తన్వి, జోష్ణ, తన్మయి విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. అలాగే ఎన్ఎస్పీ క్యాంప్, మంచికంటి భవన్‌లో 'విజ్ఞాన దర్శిని' ఆధ్వర్యంలో నిర్వహించిన సైంటిస్టుల వేషధారణ పోటీలలో కె. కీర్తి శివాని, ఎస్. బృంద, కె. మిష్టి, ఎస్. యశో కీర్తన్, ఎమ్. యశ్వంత్, ఎండి. అష్రఫ్ లతో పాటు ప్రాహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ (ఖమ్మం జిల్లా) ఆధ్వర్యంలో నిర్వహించిన 'సోషా ముక్త్ భారత్' క్విజ్ పోటీలలో టి. చేతన్ అద్విక్, పి. జస్మితా శ్రీ, నిత్య, శరణ్య విద్యార్థులు పాల్గొని సర్టిఫికేట్లు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ ఆర్.వి. నాగేంద్ర కుమార్ మాట్లాడుతూ "విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడంలో సర్వజ్ఞ ఎల్లప్పుడూ ముందుంటుంది. చదువుతో పాటు కళలు, సైన్స్, సామాజిక అవగాహన పోటీలలో విద్యార్థులు ప్రతిభ చూపడం అభినందనీయం" అని పేర్కొన్నారు.పాఠశాల డైరెక్టర్ కె. నీలిమ మాట్లాడుతూ "బాలోత్సవ్‌లో గ్రూప్ డాన్స్ విభాగంలో విన్నర్స్ షీల్డ్ సాధించడం, ఇతర పోటీలలో సర్టిఫికేట్లు గెలుచుకోవడం పాఠశాలకు ఎంతో గర్వకారణం. విజేతలైన విద్యార్థులకు హృదయపూర్వక అభినందనలు" అని తెలిపారు. విజేతలైన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్

- డిసెంబర్ 11 నుంచి 22 వరకు తెలంగాణలో ఖేలో ఇండియా యూత్ గేమ్స్
- జాతీయ స్థాయి క్రీడా పోటీలకు తెలంగాణ వేదిక కావడం గర్వకారణం



ఖమ్మం, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :

మధిర పట్టణంలోని రెడ్డి గార్డెన్స్ లో బుధవారం రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ తో కలిసి, తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026కు సంబంధించిన లోగో, మస్కట్, బ్రోచర్ లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ, ప్రతిష్ఠాత్మకమైన ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు తెలంగాణ ఆతిథ్యం ఇవ్వడం రాష్ట్రానికి దక్కిన గొప్ప గౌరవమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ప్రధాన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో క్రీడా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహిస్తున్నామని తెలిపారు.డిసెంబర్ 11 నుంచి 22 వరకు జరిగే ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయంతో ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, అధికారులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. క్రీడలు కేవలం పతకాల సాధనకే పరిమితం కావని, యువతలో క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు దోహదపడతాయని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణ యువత చదువులతోపాటు క్రీడల్లోనూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలన్నదే ప్రజా ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. క్రీడల్లో తెలంగాణ సత్తా చాటుదాం. ఖేలో ఇండియాను విజయవంతం చేద్దాం అని మంత్రి అన్నారు.ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026 విజయవంతానికి క్రీడాకారులు, క్రీడాభిమానులు, యువత, ప్రజలందరూ భాగస్వాములు కావాలని మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా క్రీడలు, యువజన సర్వీసుల అధికారి తుంబూరు సునీల్ కుమార్, ఇంచార్జ్ డీఆర్డీవో శిరీష, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డా. పురందర, జిల్లా మత్స్య శాఖ అధికారి మల్లేశం, మధిర మున్సిపల్ చైర్ పర్సన్ సాధినేని సుజాత, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు, మత్కెపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మధిర మున్సిపల్ కమిషనర్ సామ్యూల్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం సీనియర్ నాయకుడు బాబన్న మృతి కి తెలంగాణ సాహితీ సంతాపం

భద్రాచలం, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :

ప్రజానాట్యమండలి కళాకారుడిగా, సీపీఎం సీనియర్ నాయకుడిగా ప్రజా ఉద్యమాలకు, అభ్యుదయ కళా సాంస్కృతిక రంగానికి బాబన్న ఎన లేని సేవలు అందించారని తెలంగాణ సాహితీ తెలిపింది. బాబన్న కొత్తగూడెం లో బుధవారం అనారోగ్యం తో మరణించారు. తెలంగాణ సాహితీ భద్రాచలం శాఖ బాబన్న మృతి పట్ల తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది.బాబన్న నివాసం వద్ద నిర్వహించిన సంతాప సభ లో పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలకు బాబన్న అందించిన సేవలను కొనియాడారు. కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు ఆయన భౌతికకాయాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించనున్నారు. తెలంగాణ సాహితీ భద్రాచలం కార్యదర్శి తాతోలు దుర్గాచారి, సభ్యులు కత్తి కనకదుర్గ, పూర్ణిమ యర్రంశెట్టి బాబన్న భౌతికకాయాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.ప్రజానాట్యమండలి ద్వారా కళను ప్రజల గొంతుకగా మలిచి, తన జీవితాన్ని ప్రజా ఉద్యమాలకు అంకితం చేసిన బాబన్న సేవలు చిరస్మరణీయమని వారు పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, కళా స్ఫూర్తి భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు.




ఉమ్మడి ఖమ్మం జిల్లా నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు

: జిల్లా ఉపాధి కల్పన అధికారిణి మాధవి

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈ నెల 20న (శుక్రవారం) ఖమ్మంలోని హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీ కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారిణి ఎన్. మాధవి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో పనిచేసేందుకు ఆసక్తి గల అభ్యర్థుల కోసం ఈ నియామకాలు చేపడుతున్నట్లు అన్నారు. ఈ జాబ్ మేళాలో హైదరాబాద్‌కు చెందిన రోషన్ టెక్నాలజీ కంపెనీలో ప్రాడక్షన్ అసోసియేట్, అసెంబ్లీ ఆపరేటర్, మెషిన్ ఆపరేటర్, వేర్‌హౌస్ అసోసియేట్ మరియు టెక్నీషియన్ (విద్యార్హత ఆధారంగా) విభాగాలలో మొత్తం 20 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. ఈ పోస్టులకు ఐటీఐ (అన్ని ట్రేడ్లు), ఏదైనా డిగ్రీ, డిప్లామా, బీటెక్/బీఈ ఉత్తీర్ణులైన ఫ్రెషర్స్, అనుభవం ఉన్న అభ్యర్థులు అర్హులని, వీరికి రూ. 15 వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. అలాగే హైదరాబాద్‌లోని ఎలక్ట్రో సర్క్యూట్ సిస్టమ్ ఇండస్ట్రీలో ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ విభాగంలో 20 ఖాళీలు ఉన్నాయని, ఇందుకు ఐటీఐ (ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, వెల్డర్) పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ. 15 వేల వేతనంతో పాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం, అదనంగా రూ. 6 వేల టీఏ అండ్ డీఏ (టీఏ అండ్ డీఏ) ఇవ్వబడుతుందని, అయితే ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు తప్పనిసరిగా ద్విచక్ర వాహనం (టూ వీలర్) ఉండాలని స్పష్టం చేశారు. మొత్తం 40 ఉద్యోగ ఖాళీలకు 18 నుండి 30 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు అర్హులని, ఎంపికైన వారికి రూ. 12 వేల నుండి రూ. 17 వేల వరకు వేతనాలు లభిస్తాయని అన్నారు. అర్హత, ఆసక్తి గల ఖమ్మం జిల్లా నిరుద్యోగ యువతీ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్ల జిరాక్స్ కాపీలతో ఈ నెల 20వ తేదీ ఉదయం 10:00 గంటలకు హవేలీ రెస్టారెంట్ ఎదురుగా ఉన్న టీటీడీసీ, ఖమ్మం నందు జరిగే జాబ్ మేళాకు నేరుగా హాజరు కావాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా వివరాలు పక్కా నమోదు చేయాలి

- మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ



ఖమ్మం, వైరా, (జర్నలిస్ట్ ఫైల్) : తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ తెలిపారు. ఇందిరమ్మ జీవిత బీమా వివరాలు పక్కాగా నమోదు చేయాలనిరాష్ట్రలోని ప్రతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించింది అని తెలిపారు. కులం మతంఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి కుటుంబానికి జీవిత బీమా రక్షణ కల్పించడమే ఇది ప్రధాన ఉద్దేశం అని ఆయన పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా భద్రత కల్పిస్తారని తెలిపారు నవంబర్ 19న ప్రతి వార్డులు ప్రత్యేక నమోదు కేంద్రం ఏర్పాటు చేసి కుటుంబాల వివరాలను సేకరించాలని తెలిపారు. జీవిత బీమా కవరేజ్ కోసం 18 నుంచి 59 సంవత్సరాల వయసుగల కుటుంబ సంపాదన సభ్యుల వివరాలు కచ్చితంగా సేకరించాలని సూచించారు. వయసు నిర్ధారణకు ఆధార్ కార్డులో నమోదు అయిన పుట్టిన తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు.

ప్రతిరోజు రెండు వార్డులలో నమోదు కార్యక్రమం : లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యేక కౌంటర్లు నువైరా మున్సిపాలిటీ పరిధిలో జీవిత బీమా రక్షణ లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రతి వార్డులో ప్రతి 50 మందికిప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి ప్రజలందరూ సులభంగా నమోదు చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు ఆమె తెలిపారు.వార్డు కౌన్సిలర్లు ఆయా ప్రాంతాల్లో నమోదు కేంద్రాలలో పర్యవేక్షిస్తారని అని చంద్రకళ తెలిపారు.తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా చైర్మన్ ఎండి ఖాదర్ బాబా ప్రత్యేక చొరవతో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఘనంగా వ్యాస రచన పోటీలు

ఖమ్మం, (జర్నలిస్ట్ ఫైల్) :



ఖమ్మం జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయం (డిసి ఎల్), ఖమ్మంలో పాఠశాల విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 150 మంది విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ రచనా ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ ఖాదర్ బాబా మాట్లాడుతూ విద్యార్థులలో పుస్తక పఠనంపై ఆసక్తిని పెంపొందించడం, సృజనాత్మక ఆలోచనా విధానాన్ని ప్రోత్సహించడం, భాషా పరిజ్ఞానాన్ని మరియు రచనా నైపుణ్యాలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు చదువుతో పాటు పుస్తక పఠనానికి కూడా సమయం కేటాయించాలని, గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యాస రచన పోటీలు విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మక ప్రతిభను వెలికితీయడానికి చక్కని వేదికగా నిలుస్తాయని, చిన్న వయస్సు నుంచే చదవడం, రాయడం అలవాటు చేసుకోవడం ద్వారా భవిష్యత్తులో ఉన్నత లక్ష్యాలను సాధించవచ్చని చైర్మన్ పేర్కొన్నారు.విద్యార్థుల నుంచి లభించిన విశేష స్పందన పట్ల చైర్మన్ సంతోషం వ్యక్తం చేస్తూ, జిల్లాలో గ్రంథాలయాల అభివృద్ధితో పాటు విద్యార్థులు, యువతలో విజ్ఞానాభివృద్ధికి జిల్లా గ్రంథాలయ సంస్థ తరపున మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. పద్మజ, గ్రేడ్-I గ్రంథపాలకులు సి. మాల్సూర్, గ్రేడ్-III గ్రంథపాలకులు బాబు, వెంకటేశ్వర్లు, సీనియర్ అసిస్టెంట్ పి. సంతోష్, ఇతర గ్రంథాలయ సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏఐ నైపుణ్యాలే భవిష్యత్తుకు బాటలు: అంకుర్ మిట్టల్

- నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ప్రారంభం





మేడ్చల్ నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్): మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని పలువురు ప్రముఖులు సూచించారు. మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (AIML) విభాగంలో అత్యాధునిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఘనంగా ప్రారంభించారు. క్యాప్‌జెమిని సంస్థ సౌజన్యంతో కళాశాల చైర్మన్ జె. నర్సింహారెడ్డి దార్శనికతలో, కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి ఆధ్వర్యంలో, డైరెక్టర్ డా. ఏ. మోహన్ మార్గదర్శకత్వంలో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి క్యాప్‌జెమిని సీనియర్ మేనేజర్ అంకుర్ మిట్టల్ ముఖ్య అతిథిగా, నెక్సిన్‌ఫ్యూస్ సీఈఓ సిద్దు సాయికృష్ణ కుందుర్తి గౌరవ అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రాక్టికల్ నైపుణ్యాలను పెంపొందిం చడమే ఈ కేంద్రం ప్రధాన ఉద్దేశమన్నారు. విద్యార్థులు కేవలం విద్యా పరిజ్ఞానికే పరి మితం కాకుండా, పరిశ్రమల్లో ఎదురయ్యే సమస్యలకు పరిష్కా రాలు చూపగల సామర్థ్యాన్ని అలవర్చు కోవాలని సూచించారు. వినూత్న ఆలోచనలు, సృజనాత్మకతకు హ్యాకథాన్‌ల వంటి కార్య క్రమాలు చక్కని వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. పరిశ్ర మలకు, విద్యారంగానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించడంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. సాంకేతిక రంగంలో వేగంగా వస్తున్న మార్పులను అందిపుచ్చుకుంటూ విద్యార్థులు తమను తాము నిరంతరం అప్‌డేట్ చేసుకోవాలని సూచిం చారు. ఈ కార్యక్ర మంలో కళా శాల చైర్మన్ జె. నర్సింహారెడ్డి, కోశాధికారి జె. త్రిలోక్ రెడ్డి, డైరెక్టర్ డా. మోహన్, ప్రిన్సి పాల్ లోకనాథం, AIML విభాగాధిపతి వరప్రసాద్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్యాప్‌జెమినితో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు అభినందనీయం: త్రిశూల్ రెడ్డి

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో క్యాప్‌జెమిని సంస్థ సహకారంతో ఏఐ అండ్ మెషిన్ లెర్నింగ్ (AIML) విభాగంలో ఏర్పాటు చేసిన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమంలో నర్సింహారెడ్డి కళాశాల కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక సాంకేతిక యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రతి రంగంలోనూ కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. విద్య, వైద్యం, పరిశ్రమలు, వ్యాపార రంగాలతో పాటు అనేక విభాగాల్లో ఏఐ వినియోగం రోజు రోజుకూ విస్తరిస్తోందని పేర్కొన్నారు. ఇలాంటి తరుణంలో క్యాప్ జెమిని వంటి అంతర్జాతీయ సంస్థ సహకారంతో కళాశాలలో అత్యాధునిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు కావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందన్నారు. ఈ కేంద్రం ద్వారా విద్యార్థు లకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ప్రత్యక్ష అవగాహనతో పాటు పరిశ్రమలకు అవసరమైన ప్రాక్టికల్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. విద్యార్థులు తరగతి గదుల్లో నేర్చుకున్న విషయాలకే పరిమితం కాకుండా, నిరంతరం కొత్త విషయాలను నేర్చుకుంటూ సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను అందిపుచ్చుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఏఐ, మెషిన్ లెర్నింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాల్లో ప్రత్యేక నైపుణ్యాన్ని సంపాదించుకోవాలని, అందుబాటులో ఉన్న ఆధునిక ప్రయోగశాలలు, సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించు కోవాలని కోరారు. నిరంతర అభ్యాసం, కృషి, సృజనాత్మక ఆలోచనలతోనే భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించ గలరని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దడంలో ఈ సెంటర్ కీలక వేదికగా నిలుస్తుందని త్రిశూల్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

కల్వకుర్తి కాంగ్రెస్ లో గిరిజనులకు గుర్తింపు ఏది?

- అధికారంలోకి వచ్చాక కార్యకర్తల సేవలు విస్మరణ
- నామినేటెడ్ పదవుల్లో ఎస్సీ,ఎస్టీ,బీసీలకు ప్రాధాన్యత కల్పించాలనే డిమాండ్
- 30 ఏళ్ల కాంగ్రెస్ సేవకు దక్కని గుర్తింపు!
- హనుమ నాయక్ ఆవేదన

కడ్తాల్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్): ఎన్నికల సమయంలో పార్టీ జెండాలు మోసేందుకు,సభలు,సమావేశాలు నిర్వహించేందుకు,అభ్యర్థుల గెలుపు కోసం అహర్నిశలు శ్రమిం చేందుకు కార్యకర్తలు కావాలి.కానీ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత అదే కార్యకర్తలకు రాజకీయ గుర్తింపు,సముచిత గౌరవం, పదవులు కల్పించే విషయంలో మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తున్నారనే ప్రశ్న కల్వకుర్తి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారుతోంది.ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ కోసం దశాబ్దాలుగా పనిచేస్తున్న బంజారా గిరిజన నాయకులు, కార్యకర్తలకు తగిన రాజకీయ ప్రాధాన్యత దక్కడం లేదనే అసంతృప్తి వ్యక్తమవుతోంది. ప్రజా ప్రభుత్వం,సామాజిక న్యాయం,అన్ని వర్గాలకు సముచిత అవకాశాలు కల్పిస్తామని చెబుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకత్వం కల్వకుర్తి నియోజకవర్గంలోని ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలకు రాజకీయంగా ఎంతమేరకు భాగస్వామ్యం కల్పించిందనే చర్చకు ఈ పరిణామాలు తెరలేపుతున్నాయి.ఎన్నికల సమయంలో పార్టీ విజయానికి కృషి చేసిన సామాజిక వర్గాలకు అధికారంలో భాగస్వామ్యం కల్పించాల్సిన బాధ్యత నాయకత్వంపై ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

30 ఏళ్లుగా పార్టీ జెండా మోసిన హనుమ నాయక్‌కు గుర్తింపు ఏది?

కాంగ్రెస్ పార్టీలో సుమారు మూడు దశాబ్దాలుగా సాధారణ కార్యకర్తగా కొనసాగుతూ,పార్టీ కార్యక్రమాలకు తన వంతు కృషి చేసిన హనుమ నాయక్ ప్రస్తుతం తనకు తగిన గుర్తింపు లభించడం లేదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.పదవుల కోసం కాకుండా పార్టీ సిద్ధాంతాలు,నాయకత్వంపై నమ్మకంతో ఇన్నేళ్లుగా పనిచేసినప్పటికీ,రాజకీయంగా ఎదిగేందుకు తగిన అవకాశం రాకపోవడం బాధాకరమని ఆయన వాపోతున్నట్లు సమాచారం.ఎన్నికలు వచ్చినప్పుడల్లా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం గ్రామగ్రామాన తిరుగుతూ ప్రచారంలో పాల్గొనడం, కార్యకర్తలను సమీకరించడం,పార్టీ కార్యక్రమాలను విజయ వంతం చేయడం వంటి బాధ్యతలు నిర్వహించిన నాయకులకు అధికారంలోకి వచ్చిన తర్వాత గుర్తింపు ఇవ్వకపోతే కార్యకర్తల సేవలకు విలువ ఎక్కడ ఉంటుందని ప్రశ్నిస్తున్నారు.ముఖ్యంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి గారి గెలుపు కోసం పనిచేసిన బంజారా నాయకులు,గిరిజన కార్య కర్తల సేవలను గుర్తించి తగిన రాజకీయ అవ కాశాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు. మూడు దశాబ్దాల రాజకీయ ప్రయాణంలో పార్టీకి అండగా నిలిచిన ఒక సాధారణ కార్యకర్తకు కూడా సముచిత అవకాశం దక్కకపోవడం పార్టీ అంతర్గత వ్యవహారాలపై ప్రశ్నలు లేవనెత్తు తోందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.



50 నుంచి 60 వేల మంది గిరిజన ఓటర్లు.. రాజకీయ ప్రాతినిధ్యం మాత్రం ప్రశ్నార్థకం!

కల్వకుర్తి నియోజకవర్గంలో సుమారు 50 వేల నుంచి 60 వేల మంది ఎస్టీ గిరిజన ఓటర్లు ఉన్నారని స్థానికంగా పేర్కొంటున్నారు.ఇంతటి జనాభా ఉన్న బంజారా గిరిజన సమాజానికి నామినేటెడ్ పదవులు,ప్రభుత్వ కార్పొరేషన్లు,వివిధ ప్రభుత్వ కమిటీలు,ఇతర రాజకీయ నియామకాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది.ఎన్నికల సమయంలో గిరిజన సమాజం ఓట్లు,మద్దతు కీలకంగా భావించే రాజకీయ పార్టీలు,ఎన్నికల అనంతరం అదే వర్గాలకు పదవులు, అవకాశాలు కల్పించే విషయంలో స్పష్టమైన కార్యాచరణ చూపించాల్సిన అవసరం ఉందని నాయకులు అభిప్రాయ పడుతున్నారు.కేవలం ఎన్నికల ప్రచారంలో గిరిజన నాయకులను ముందుండి నడిపించడం,సభల్లో ప్రాధాన్యత ఇవ్వడం మాత్రమే సామాజిక న్యాయం కాదని,నిర్ణయాత్మక పదవుల్లోనూ వారికి అవకాశం కల్పించినప్పుడే నిజమైన రాజకీయ భాగస్వామ్యం సాధ్యమవుతుందని పేర్కొంటున్నారు.

ఎస్సీ,ఎస్టీ,బీసీలకు నామినేటెడ్ పదవుల్లో వాటా కల్పించాలి!

సామాజిక న్యాయం అంటే ప్రకటనలకే పరిమితం కాకూడదు. అన్ని సామాజిక వర్గాలకు రాజకీయంగా ఎదిగే అవకాశాలు కల్పించాలి. ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ,బీసీ వర్గాలకు చెందిన అంకిత భావం కలిగిన నాయకులు,కార్యకర్తలను గుర్తించి ప్రభుత్వ నామి నేటెడ్ పదవులు,కార్పొరేషన్ పదవులు,మార్కెట్ కమిటీలు,వివిధ ప్రభుత్వ సంస్థలు,కమిటీల్లో సముచిత ప్రాతినిధ్యం కల్పించాలనే డిమాండ్ వినిపిస్తోంది.పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనపెట్టి, రాజకీయ అవకాశాలు కొద్దిమందికే పరిమితమవుతున్నాయనే భావన కార్యకర్తల్లో నెలకొంటే పార్టీ పునాదులపైనే ప్రభావం పడే అవకాశం ఉంటుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడు తున్నారు.కార్యకర్తల కష్టాన్ని గుర్తించడం,సామాజిక వర్గాలకు గౌరవం కల్పించడం,అర్హత కలిగిన నాయకులకు అవకాశాలు ఇవ్వడం పార్టీ నాయకత్వం బాధ్యతగా భావించాలి.

కేసీఆర్ పాలనలో గిరిజన తండాలకు గ్రామపంచాయతీ హోదా.. ఇప్పుడు రాజకీయ అవకాశాలపై ప్రశ్నలు!

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో గిరిజన తండాలను గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేయడం,గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన,గిరిజన సంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం వంటి అంశాలను బీఆర్ఎస్ నాయకులు ప్రస్తావిస్తు న్నారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోని పదేళ్ల పాలనలో గిరిజన తండాలకు ప్రత్యేక గుర్తింపు కల్పించిన అంశాన్ని గుర్తుచేస్తున్నారు.అయితే ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, సమాన అవకాశాల గురించి చెబుతున్న నేపథ్య లో కల్వకుర్తి నియోజకవర్గంలోని గిరిజన నాయకులకు రాజకీయంగా ఎలాంటి అవకాశాలు కల్పిస్తున్నారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ప్రభుత్వాల అభివృద్ధి కార్యక్రమాలు ఒక అంశమైతే,రాజకీయ ప్రాతినిధ్యం మరో అంశం. రెండింటిలోనూ గిరిజన సమాజానికి తగిన గుర్తిం పు లభించాలని స్థానిక నాయకులు కోరుతున్నారు.

వంశీచంద్ రెడ్డి నాయకత్వంపై హనుమ నాయక్ అసంతృప్తి?

కాంగ్రెస్ పార్టీలో గత 30 ఏళ్లుగా కొనసాగిన హన్మ నాయక్‌కు తగిన గుర్తింపు,రాజకీయ అవకాశం దక్కడం లేదనే అసంతృప్తి నెలకొన్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా వంశీచంద్ రెడ్డి రాజకీయ వ్యవహారశైలి,ఎస్సీ,ఎస్టీ నాయకులకు నామినేటెడ్ పదవులు, రాజకీయ అవకాశాలు కల్పించే విషయంలో నాయకత్వం అనుసరిస్తున్న తీరుపై ఆయన అసంతృప్తిగా ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది.

పార్టీ కోసం ఇన్నేళ్లు పనిచేసిన తర్వాత కూడా తనకు తగిన గుర్తింపు లభించకపోతే ఇక పార్టీలో కొనసాగి ప్రయోజనం ఏమిటనే ప్రశ్న ఆయనలో తలెత్తినట్లు సమాచారం.ఈ పరిణామాల నేపథ్యంలో హన్మ నాయక్ పార్టీ మారే ఆలోచనలో ఉన్నారా? లేక కాంగ్రెస్ నాయకత్వం ఆయన అసంతృప్తిని గుర్తించి సముచిత అవకాశం కల్పిస్తుందా? అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.అయితే ఆయన పార్టీ మార్పుపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.కాంగ్రెస్ నాయకత్వం స్పందించి ఆయనతో పాటు దీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న గిరిజన నాయకులు,కార్యకర్తల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నాయకుల చుట్టూ తిరిగితేనే పదవులా? కష్టపడిన కార్యకర్తలకు న్యాయం ఎప్పుడు?

రాజకీయాల్లో పదవులు కొందరికే పరిమితం కాకూడదు.పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తల సేవలకు గుర్తింపు ఉండాలి. సామాజిక వర్గాల జనాభా,రాజకీయ భాగస్వామ్యం,పార్టీకి వారు అందించిన సేవలను పరిగణనలోకి తీసుకుని అవకాశాలు కల్పించాలి.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం పట్ల తన నిబద్ధతను నియామకాల ద్వారా చాటుకోవాలని స్థానిక గిరిజన నాయకులు కోరుతున్నారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,పార్టీ ముఖ్య నాయకత్వం ఈ అంశంపై దృష్టి సారించి బంజారా గిరిజనులకు తగిన రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

రేషన్ కార్డు లేని అర్హులకూ పథకం ప్రయోజనాలు

- కుటుంబ యజమాని భార్యనే నామినీగా నమోదు చేయాలి.



వికారాబాద్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్): వికారాబాద్ జిల్లాలో అన్ని మండల పరిధిలోని గ్రామాలను మూడు భాగాలుగా విభజించి యాప్‌లో కుటుంబాల వివరాలను సమగ్రంగా నమోదు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ. గ్రామాలను మూడు భాగాలుగా విభజించి కుటుంబాల వివరాల నమోదు చేపట్టాలని, ప్రతి గ్రామంలో సమావేశాలు ఏర్పాటు చేసి సర్పంచులు, ఉప సర్పంచులకు, మున్సిపాలిటీల పరిధిలో వార్డు సభ్యులకు ఈ కార్యక్రమంపై అవగాహన కల్పించాలని సూచించారు. వివరాల నమోదు కోసం అవసరమైన ప్రింటర్లు, స్కానర్లు, కంప్యూటర్లను ఏర్పాటు చేస్తామని, నిర్దేశించిన లక్ష్యం మేరకు బాధ్యతాయుతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీకి ప్రత్యేక లాగిన్ ఉంటుందని, దరఖాస్తులను స్కాన్ చేసి యాప్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. కుటుంబ యజమాని తన భార్యను నామినీగా నమోదు చేసుకోవాలని, రేషన్ కార్డు ఆధారంగా పథకం అమలు చేయాలని సూచించారు. ఆధార్ కార్డులో పుట్టిన తేదీ లేకుంటే జూలై 1వ తేదీని ప్రామాణికంగా తీసుకోవాలని తెలిపారు. దరఖాస్తులో ఆధార్ కార్డు, ఫోన్ నంబర్ వివరాలను తప్పనిసరిగా పరిశీలించాలని, నామినీ పేరు నమోదు చేయడంతో పాటు కుటుంబ యజమాని సమర్పించిన దరఖాస్తు ఫారాన్ని యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. రేషన్ కార్డులు లేని అర్హులైన కుటుంబాలకు కూడా పథకం ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. అప్‌లోడ్ చేసిన ప్రింటెడ్ ఫారంపై ఇన్‌చార్జి అధికారి సంతకం తీసుకొని తిరిగి అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఈడీఎం కుటుంబ వివరాల నమోదు ప్రక్రియను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో సీపీఓ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

- మక్తమాదారంలో అర్హులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ
- వృద్ధులు,దివ్యాంగులు,ఒంటరి మహిళలకు ఆర్థిక భరోసా
- యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్



కడ్తాల్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్): పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని కల్వకుర్తి యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు షాబుద్దీన్ అన్నారు.రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలం మక్తమాదారం గ్రామంలో ప్రభుత్వం ఇటీవల మంజూరు చేసిన చేయూత పెన్షన్లకు సంబంధించిన మంజూరు పత్రాలను బుధవారం అర్హులైన లబ్ధిదారులకు గ్రామ ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా షాబుద్దీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో అర్హులైన పేద ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ముఖ్యంగా చేయూత పెన్షన్ పథకం ద్వారా వృద్ధులు,దివ్యాంగులు,ఒంటరి మహిళలు తదితర అర్హులకు ప్రతినెలా ఆర్థిక సహాయం అందిస్తూ వారి జీవనానికి భరోసా కల్పిస్తోందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న ప్రతి ఒక్కరూ వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ మంజూరు కాని వారు సంబంధిత అధికారులను సంప్రదించి తమ సమస్యలను తెలియజేయాలని కోరారు.ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అంది స్తానని తెలిపారు.పెన్షన్ మంజూరు పత్రాలు అందుకున్న లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లక్ష్మీదేవి నర్సింహా గౌడ్,ఉపసర్పంచ్ ఎర్ర శ్రీనివాస్ గౌడ్,గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకటరెడ్డి,కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు బాలరాజ్,వార్డు సభ్యులు శ్రీకాంత్ గౌడ్,మైసమ్మ,యాదయ్య,నింగ్యారి యాదగిరి,గ్రామ నాయకులు మర్ల చెన్నయ్య,బోల్గం నరేష్ గౌడ్,రామచంద్రి,పెన్షన్ లబ్ధిదారులు,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో చేయూత వెలుగులు

- కొత్త పెన్షన్ పత్రాలు పంపిణీ చేసిన సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్



షాబాద్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్): ప్రజా పాలన ప్రభుత్వం మంజూరు చేసిన కొత్త పెన్షన్ పేదల జీవితాల్లో కొత్త వెలుగులు నిందుతాయని నాగర్ గూడ సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్ పేర్కొన్నారు.బుధవారం షాబాద్ మండలం నాగర్ గూడ గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ బండ స్వరూప మహేందర్ గౌడ్, ఉపసర్పంచ్ వేణుగోపాల్‌తో కలిసి లబ్ధిదారులకు మంజూరీ పత్రాలను అందజేశారు.

ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు ఈ పింఛన్లు ఎంతో అండగా నిలుస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. గ్రామంలోని అర్హులైన పేదలు, వృద్ధులు, వికలాంగులు, వృత్తిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందడం ద్వారా వారి జీవితాల్లో ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా గ్రామపంచాయతీ ముందుకు సాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వేణుగోపాల్, వార్డు సభ్యులు మహిపాల్, క్రాంతికుమార్, అఫ్సర్, కృష్ణయ్య గౌడ్,శ్రీలత,భాగ్యమ్మ, కావ్య,పంచాయతీ కార్యదర్శి దయాకర్ రెడ్డి, పింఛన్ లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వం చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం

- ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్



శంషాబాద్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్): హైదరాబాద్‌లోని పిజెటిఏయు ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు గౌరవ ప్రకాష్ గౌడ్ ఆధ్వర్యంలో కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.ఈ సందర్భంగా అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్‌కు సంబంధించిన పత్రాలను అందజేసి, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలోభాగస్వాములయ్యారు.ప్రజల సంక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న చేయూత పెన్షన్ పథకం వృద్ధులు, దివ్యాంగులు మరియు ఇతర అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక భరోసాను అందిస్తోంది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి అర్హుడికి చేరేలా కృషి చేయాలని ఆకాంక్షించారు.

ప్రజా సంక్షేమమే మా లక్ష్యం – గ్రామ అభివృద్ధే మా ధ్యేయం ఈ కార్యక్రమంలో చౌదరిగూడ గ్రామ సర్పంచ్ మల్చలం లక్ష్మీ లింగం డిప్యూటీ సర్పంచ్ ప్రేమ్ రాజ్, వార్డు సభ్యులు,గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు మరియు ఇతర నాయకులతో కలిసి పాల్గొన్నారు.

భూ రీ సర్వేను పరిశీలించిన అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి

- మునీరాబాద్‌లో క్షేత్రస్థాయిలో పర్యటన..!



మేడ్చల్ నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వే కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడ్చల్ మండలం మునీరాబాద్ గ్రామంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించి సర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా భూ రీ సర్వే ప్రక్రియ, భూముల వివరాల నమోదు, సాంకేతిక విధానాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టాదారు పాస్‌బుక్‌లోని భూ ఆధార్ నంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో భూమి లోకేషన్‌ను గుర్తించడం జరుగుతుందని మండల తహసీల్దార్ అదనపు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం అదనపు కలెక్టర్ రైతులతో మాట్లాడి భూ రీ సర్వేకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. సర్వే నిర్వహణలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా భూముల వివరాలను నమోదు చేయాలని సర్వేయర్లకు సూచనలు చేశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సమన్వయంతో సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ పర్యటనలో మేడ్చల్ తహసీల్దార్ భూపాల్, ఆర్ఐ చందన్ రెడ్డి, సర్వేయర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన వితంతువులకు చేయూత పెన్షన్లు మంజూరు..



మణికొండ, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన పేదలకు అండగా నిలుస్తూ చేయూత పథకం ద్వారా వితంతు పెన్షన్లను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో మణికొండ--నెక్నాంపూర్ డివిజన్ పరిధిలో నూతనంగా పెన్షన్లు మంజూరైన వితంతు లబ్ధిదారులకు నేడు నార్సింగి సర్కిల్ కార్యాలయంలో పెన్షన్ మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ మాజీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు పెన్షన్ మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేదలు, వితంతువులు, నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎంతో భరోసానిస్తాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏర్పుల కుమార్, శ్రవణ్ కుమార్, ఈ. గంగాధర్ రావు, శివగంగ తదితరులు పాల్గొన్నారు.

కీసరలో నూతన గ్రంథాలయం ప్రారంభం



కీసర, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్): కీసరలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి బుధవారం ప్రారం భించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మల్లారెడ్డి, డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మల్లిపెద్ది సుధీర్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..గ్రంథాలయాలు విజ్ఞానాన్ని పెంపొందిం చడంతో పాటు విద్యార్థులకు పోటీ పరీక్షల సన్నద్ధతకు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు సాధించేందుకు అవసరమైన పుస్తకాలు, సమాచారాన్ని అందుబాటులో ఉంచడం అభినందనీయమన్నారు. య

సినీ నటుడు శివారెడ్డికి ఎమ్మెల్యే కుమారుడి వివాహనికి ఆహ్వానించిన రామకృష్ణారెడ్డి.



రాజేంద్రనగర్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) : రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్ తనయుడు సంతోష్ గౌడ్-శ్రీ యాషిల వివాహం ఈ నెల 22వ తేదీన ఇవంతా కన్వెన్షన్ వట్టినాగులపల్లిలో జరగను న్నందున,మణికొండలో నివాసం వుండే సినీ నటుడు శివారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రిక అందజేశారు.ఈ సందర్భంగా శివారెడ్డిని వివాహ వేడుకకు విచ్చేసి వధూవరులను ఆశీర్వదించాలని ఆహ్వా నించడం జరిగిందన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై దాడి యత్నం: కేసు నమోదు



ఏన్కూర్, నవంబరు19(జర్నలిస్ట్ ఫైల్):ఏన్కూర్ మండల పరిధిలోని బురద రాఘవా పురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న పంచాయతీ కార్యదర్శిపై దాడికి యత్నించిన ఘటన కలకలం రేపింది.గ్రామ పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్న కంచర్ల కోటేశ్వరరావు బుధవారం మధ్యాహ్నం సుమారు 3:30 గంటల సమయంలో కార్యాలయంలో విధుల్లో ఉన్నారు. అదే గ్రామానికి చెందిన బాదావత్ రామదాస్ అక్కడికి వచ్చి, విధులకు ఆటంకం కలిగిస్తూ అసభ్య పదజాలంతో దూషించా డని, దాడికి యత్నించి బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏన్కూరు ఎస్సై సంధ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ప్రభుత్వ ఉద్యోగులు విధి నిర్వహణలో ఉన్నప్పుడు వారిపై దాడులకు పాల్పడటం, బెదిరించడం లేదా విధులకు ఆటంకం కలిగించడం చట్టరీత్యా నేరమని, ఇటువంటి చర్యలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎంహెచ్వో



నిజామాబాద్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) : జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ నిజమాబాద్ పట్టణంలోని గౌతమ్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా డిఎంహెచ్ఓ వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని,టీకాల అర్హుల జాబితా లిస్టును,సెషన్ ప్లాన్ను,డ్రాప్ అవుట్ పిల్లల జాబితాను పరిశీలించి వంద శాతం వ్యాధినిర్ధక టీకాలను ఇవ్వాలని అన్నారు.తప్పిపోయిన ప్రతి పిల్లాడిని ఆశ వ్యక్తిగతంగా పర్యవేక్షించి టీకాలు ఇవ్వాలి అన్నారు.డి ఫ్రీజర్,ఐఎల్ఆర్ ను చూసి,కోల్డ్ చైన్ నిర్వహిస్తూ,టెంపరేచర్ రికార్డు చేయాలన్నారు.ఆసుపత్రిలో జరిగే ప్రసవాలు,గర్భిణీ స్త్రీల నమోదు రిజిస్టరు,ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీల రికార్డులను పరిశీలించి 100% ఆస్పత్రి ప్రసవాలు జరగాలని,ప్రమాదకర లక్షణాలు గల గర్భిణీ స్త్రీలను ముందుగానే ఉన్నత ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు.సర్వైకల్ క్యాన్సర్ నియంత్రణకు 14 ఏళ్ల బాలికలకు హెచ్పీవీ టీకాలను అర్హులైన బాలికలు అందరికీ ఇవ్వాలని,తల్లిదం డ్రులకు టీకాపై అవగాహన కలిగించాలని,పెండింగ్ లో ఉన్న టీకాలను మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు.18 సంవత్సరాలు నిండిన మహిళలందరికీ ఆరోగ్య మహిళ ద్వారా జీవనశైలి వ్యాధుల నియంత్రణ కోసం,మహిళల ఆరోగ్య కోసం పరీక్షలు నిర్వహించాలన్నారు.ల్యాబ్ రికార్డులు,శాంపుల్ రిపోర్టులు,నాకు రిజిస్టర్,రిజిస్టర్,హెచ్ఎంఐఎస్ రిపోర్ట్ లను పరిశీలించారు.ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,రికార్డులను రిపోర్టులను ఎప్పటికప్పుడు సవరించు కుంటూ నాణ్యమైన సేవలను అందించాలని వైద్యాధికారికి,వైద్య సిబ్బందికి తెలి యజేశారు.తనిఖీ సమయంలో ఆస్పత్రి వైద్యాధికారిని మైత్రి,ఫార్మసిస్టు,ఏఎ న్ఎంలు,వైద్య సిబ్బంది ఉన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు మోస్రా మండలంలో సమావేశం





నిజామాబాద్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం (IKJBP) ప్రారంభం నేపథ్యంలో మోస్రా మండలంలో పథకం అమలుకు చేపట్టాల్సిన ముందస్తు ఏర్పాట్లపై సన్నాహక సమావేశం నిర్వహించడం జరిగింది.మండల ప్రత్యేక అధికారి ఏ.పురుషోత్తం అధ్యక్షతన నిర్వహిం చిన ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాస్ గౌడ్,ఎంఈఓ నాగనాథ్,గ్రామ సర్పంచులు,గ్రా మపంచాయతీ కార్యదర్శులు,క్లస్టర్ ప్రత్యేక అధి కారులు,ఆశా కార్యకర్తలు, ఐకెపి వివోస్, అంగన్వాడీ కార్యకర్తలు, ఇతర గ్రామస్థాయి అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేక అధికారి ఏ.పురుషోత్తం మాట్లాడుతూ.... ప్రభుత్వం జారీ చేసిన పథకం అమలు మార్గదర్శకాలను అధికారులు,సిబ్బం దికి వివరించారు.అర్హులైన కుటుంబాలను గుర్తించడం,కుటుంబంలో బీమా పొందే అర్హత కలిగిన సంపాదించే సభ్యుల వివరా లను సేకరించడం,గ్రామపంచాయతీల వారీగా నమోదు శిబిరాల నిర్వహణ,దరఖాస్తుల పరిశీ లన,ఆధార్,రేషన్ కార్డు,మొబైల్ నంబర్లు,నా మినీ వివరాల నమోదు వంటి అంశాలపై అవ గాహన కల్పించారు.అలాగే ప్రతి గ్రామపంచా యతీలో నమోదు శిబిరాల నిర్వహణకు అవస రమైన ఏర్పాట్లు, సిబ్బందికి బాధ్యతల కేటాయింపు,ప్రచార కార్యక్రమాలు, బ్యానర్లు, పోస్టర్లు,కరపత్రాల ఏర్పాటు,డేటా ఎంట్రీ,రికా ర్డుల నిర్వహణపై చర్చించారు. వృద్ధులు,వి వ్యాంగులు,ఇతర బలహీన వర్గాలకు ప్రత్యేక సహాయం అందించాలని సూచించారు. మండల, గ్రామస్థాయి అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేస్తూ,అవసర మైన అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని,అర్హు లైన ఏ ఒక్క కుటుంబం కూడా నమోదు ప్రక్రియలో మిగిలిపోకుండా చూడాలని ఆదే శించారు.నమోదు శిబిరాలను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ,ప్రక్రియను పారదర్శ కంగా, సజావుగా నిర్వహించాలని సూచించారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలి

- యువతకు పట్నం మహేందర్‌రెడ్డి పిలుపు..
- అలియాబాద్, కీసరలో నూతన గ్రంథాలయ భవనాలు ప్రారంభం





మేడ్చల్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :

నేటి పోటీ ప్రపంచంలో యువత గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. యువతను చెడు అల వాట్లకు, సెల్‌ఫోన్ల వ్యసనానికి దూరంగా ఉంచి విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. బుధవారం మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని అలియాబాద్‌లో రూ.50 లక్షలతో, కీసరలో రూ.1.50 కోట్లతో నిర్మించిన నూతన గ్రంథాలయ భవనాలను ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పట్నం మహేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను సందర్శించి, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను అందుబాటులో ఉంచడంపై గ్రంథాలయ చైర్మన్, సిబ్బందిని అభినందించారు.గ్రంథాలయాలను ఆధునిక సదుపాయాలతో అభివృద్ధి చేసి యువతకు మరింత చేరువ చేయాలని సూచించారు. రానున్న రోజుల్లో అన్ని గ్రంథాలయాల్లో ఇంటర్నెట్ సౌకర్యంతో కూడిన ఈ-గ్రంథాలయాలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. అలియాబాద్‌లో నూతనంగా ప్రారం భించిన గ్రంథాలయంలోనూ ఈ-గ్రంథాలయ సదుపాయం కల్పించా లని చైర్మన్, అధికారులకు సూచించారు. యువత సమయాన్ని సద్విని యోగం చేసుకుంటూ చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి ఎదగా లని ఆకాంక్షించారు.

పేదల సంక్షేమం కోరే కాంగ్రెస్ ప్రభుత్వం :రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్.

- చేయూత పెన్షన్ పథకం ద్వారా 4,392 మంది లబ్ధిదారులకు పెన్షన్ ప్రొసీడింగ్స్ ను అందచేసిన ఎమ్మెల్యే,అధికారులు .





రాజేంద్రనగర్, నవంబరు 19 (జర్నలిస్ట్ ఫైల్) :

పేదల సంక్షేమం కోసం ఆలోచించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ అన్నారు.రాజేంద్రనగర్ నియో జకవర్గం పరిధిలోని రాజేంద్రనగర్,గండిపేట్, శంషాబాద్ మండలా లకు చెందిన 4,392 మంది లబ్ధిదారులకు బుధవారం వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియం లో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో చేయూత పెన్షన్స్ ప్రొసిడింగ్స్ ను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ..వితంతువులకు,వృద్ధులకు,వికలాం గులకు,నా అనేవాళ్ళు లేని వారి కోసం ప్రభుత్వం ఎప్పుడూ ఆలోచిస్తూ వారికి అండగా నిలుస్తుంది అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇప్పటికే వేల మందికి పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని అదనంగా 4,392 మందికి ఇవ్వడం సంతోషకరమైన విషయం అన్నారు.ఇంది రమ్మ ఇండ్లు,తెల్ల రేషన్ కార్డులు,ఉపాధి కోసం రుణాలు,మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇలా అనేక పథకాలను చేపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు.రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి,తహసిల్దార్ బొమ్మ రాములు లు మాట్లాడుతూ..అత్తాపూర్ సర్కిల్ లో 1,901 మందికి,రాజేంద్రనగర్ సర్కిల్ లో 771,నార్సింగిలో 281,మణికొండలో 263,శంషాబాద్ మండలంలో 652, శంషాబాద్ పట్టణంలో 524 మందికి నూతనంగా పెన్షన్ ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు.కార్యక్రమంలో అత్తాపూర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లోకపెద్ద మల్లారెడ్డి,డిప్యూటీ ప్రాజెక్ట్ ఆఫీసర్ లు స్వాతీ,యుగంధర్ రెడ్డి,కమ్యూనిటీ ఆర్గనైజర్ లు, మహిళా సంఘాల ప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

భూ అభ్యంతరాలపై తక్షణం చర్యలు తీసుకోవాలి




గుంటూరు, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): భూ సమీకరణపై అందుతున్న అభ్యంతరాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సి.యం.సాయికాంత్ వర్మ (జవీ.ఝుఆఝుత్ష్ర ఝుతీఝు) ఆదేశించారు. సి.ఆర్.డి.ఏ రెండవ విడత భూ సమీకరణపై జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నిడమర్రు, నవులూరులో 22(ఏ) క్రింద ఉన్న అంశాలపై దృష్టి సారించాలని అన్నారు. గ్రామస్తులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. జలవనరులు గల ప్రదేశాలపై స్పష్టమైన అవగాహనతో ముందుకు వెళ్ళాలని అన్నారు. రైల్వే లైన్ కు అవసరమగు గ్రామాల్లో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అన్నారు.
సి.ఆర్.డి.ఏ అదనపు కమిషనర్ కొల్లాబత్తుల కార్తీక్ మాట్లాడుతూ రైల్వే నుండి డ్రాయింగ్ లు రావలసి ఉందన్నారు. 1153 అభ్యంతరాలు మొత్తం అందాయన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె. ఖాజావలి, సి.ఆర్.డి.ఏ డిప్యూటీ కలెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర ఎంపీపీగా కంచర్ల సుజాత ప్రమాణ స్వీకారం



కొల్లిపర, నవంబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్): కొల్లిపర మండల పరిషత్ అధ్యక్షురాలిగా (ఎంపీపీ) కంచర్ల సుజాత గురువారం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అభినవ్ ఆమెతో ప్రమాణం చేయించారు.
ఈ సందర్భంగా అభినవ్ మాట్లాడుతూ నూతన ఎంపీపీ కంచర్ల సుజాతకు అభినందనలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతన ఎంపీపీ కంచర్ల సుజాత మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతలను నిబద్ధతతో, అంకితభావంతో నిర్వహిస్తానని తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థుల సహకారంతో మండల అభివృద్ధికి కృషి చేస్తానని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని ఆమె స్పష్టం చేశారు.
కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, నూతనంగా ఎంపికైన ఎంపీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కంచర్ల సుజాతకు అభినందనలు తెలిపారు.

నూతన ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ సన్మానం



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్):బ్రహ్మంగారిమఠం మండల ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ఎంపీపీ పూజ ఉమాదేవి, వైస్ ఎంపీపీ కానాల మాధవి, ఎంపీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం నూతన ప్రజాప్రతినిధులను శాలువాలు కప్పి, పూలమాలలతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆర్వో, ఎంపీడీవో, టీడీపీ మండల అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ భర్త పూజా శివయ్య యాదవ్, వైస్ ఎంపీపీ భర్త, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కానాల మల్లికార్జునరెడ్డి, మాజీ ఎంపీపీ వీరనారాయణరెడ్డి, టీడీపీ మండల నాయకులు పోలిరెడ్డి, ఎస్.ఆర్. శ్రీనివాసులరెడ్డి, మైదుకూరు మాజీ మున్సిపల్ చైర్మన్ మాచునూరి చంద్ర, సొసైటీ అధ్యక్షుడు సాంబశివారెడ్డి టీడీపీ ఉపాధ్యక్షుడు నరసింహగౌడ్ ఇటుకల ప్రసాద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వేమూరు ఐదు మండలాల ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు ఎన్నిక

- నూతన ప్రజాప్రతినిధులకు నక్కా ఆనందబాబు అభినందనలు
- కూటమి ఐక్యతతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలి



వేమూరు, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మండల పరిషత్ అధ్యక్షులు (ఎంపీపీ), ఉపాధ్యక్షుల (వైస్ ఎంపీపీ) ఎన్నికలు పూర్తయ్యాయి. తెలుగుదేశం--జనసేన కూటమి తరపున పోటీ చేసిన అభ్యర్థులను ఆయా మండలాల ఎంపీటీసీ సభ్యులు ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులకు వేమూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి నక్కా ఆనందబాబు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.
చుండూరు, అమృతలూరు, వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయాల్లో జరిగిన ఎన్నికల్లో ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు ఎన్నికయ్యారు. మండలాల వారీగా ఎన్నికైన వారి వివరాలు ఇలా ఉన్నాయి.
చుండూరు: ఎంపీపీగా జనసేనకు చెందిన చాపల వెంకట శివయ్య, వైస్ ఎంపీపీగా టీడీపీకి చెందిన గొర్రెపాటి అరుణ ఎన్నికయ్యారు.
అమృతలూరు: ఎంపీపీగా టీడీపీకి చెందిన ఆరెమండ్ల సునీత, వైస్ ఎంపీపీగా తుమ్మల విజయలక్ష్మి ఎన్నికయ్యారు.
వేమూరు: ఎంపీపీగా టీడీపీకి చెందిన అమ్మిశెట్టి శైలజ, వైస్ ఎంపీపీగా జనసేనకు చెందిన గోపిశెట్టి విజయ ఎన్నికయ్యారు.
కొల్లూరు: ఎంపీపీగా టీడీపీకి చెందిన తూమాటి శ్యామ్ బాబు, వైస్ ఎంపీపీగా యార్లగడ్డ శ్రీనివాసరావు ఎన్నికయ్యారు.
భట్టిప్రోలు: ఎంపీపీగా టీడీపీకి చెందిన గాత్రం సౌమ్యశ్రీ, వైస్ ఎంపీపీగా వేములపల్లి రఘునాథ్ ఎన్నికయ్యారు.
ఈ సందర్భంగా నక్కా ఆనందబాబు మాట్లాడుతూ, ఐదు మండలాల్లో ఎన్నికైన ఎంపీపీలు, వైస్ ఎంపీపీలతో పాటు ప్రమాణ స్వీకారం చేసిన టీడీపీ, జనసేన కూటమి ఎంపీటీసీ సభ్యులందరికీ అభినందనలు తెలిపారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వంలో బీజేపీ భాగస్వామ్యంతో కొనసాగుతున్న తెలుగుదేశం-జనసేన-బీజేపీ కూటమి ఐక్యత, సమన్వయం స్థానిక సంస్థల పాలకవర్గాల ఏర్పాటు ప్రక్రియలోనూ ప్రతిబింబించిందని పేర్కొన్నారు. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పరస్పర సహకారంతో వ్యవహరించడం అభినందనీయమన్నారు. ఇదే ఐక్యతను భవిష్యత్తులోనూ కొనసాగిస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.
మండలాల సమగ్ర అభివృద్ధితో పాటు ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.
తాగునీరు, పారిశుధ్యం, రహదారుల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల ద్వారా మంజూరయ్యే నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు.
ఐదు మండలాల జెడ్పీటీసీ సభ్యుల సమన్వయంతో బాపట్ల జిల్లా పరిషత్ ద్వారా నియోజకవర్గానికి అవసరమైన అభివృద్ధి పనుల కోసం మరిన్ని నిధులు సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. కూటమి ఐక్యతను కాపాడుకుంటూ వేమూరు నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో నూతన ప్రజాప్రతినిధులు కీలక భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.
ఈ కార్యక్రమంలో ఆయా మండలాల టీడీపీ, జనసేన నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యాన్ని సహించం : ఎమ్మెల్యే నసీర్

- పేదలకు మెరుగైన వైద్య సేవలు అందాలి
- రెండేళ్లలో రూ.100 కోట్లతో జీజీహెచ్ అభివృద్ధి పనులు
- రాష్ట్రానికే అపర సంజీవనిగా ప్రభుత్వ వైద్యశాల
- అన్ని విభాగాలను పటిష్టం చేశాం
- జీజీహెచ్ ను ఆకస్మికంగా తనిఖీ చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్



గుంటూరు, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్):పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించినా సహించేది లేదు. ప్రతి విభాగంలో పటిష్టమైన వైద్య సేవలు అందాలి. ఆస్పత్రికి వచ్చే పేద రోగుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యహరించాలి అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ సమగ్ర వైద్యశాలను ఎమ్మెల్యే నసీర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిటీ స్కాన్, ఎంఆర్ఐ, పెట్ స్కాన్, చిన్న పిల్లల వార్డు, జనరల్ వార్డు, ఆర్థోపెడిక్, మాతాశిశు సంరక్షణ విభాగాలను ఎమ్మెల్యే నసీర్ స్వయంగా పరిశీలించారు. ఆయా విభాగాల్లో రోగులతో మాట్లాడి వైద్య సేవలు ఎలా ఉన్నాయి అని ఆరా తీశారు. కొన్ని విభాగాల్లో సిబ్బంది సరిగా సమాధానం చెప్పడం లేదని ఫిర్యాదు చేయడంతో సంబంధిత అధికారులను పిలిచి మాట్లాడారు. రోగులకు సక్రమమైన సేవలు అందించాలని సూచించారు. ఓపీ విభాగంలో సాధ్యమైన వేగవంతంగా సేవలు అందించాలని చెప్పారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 100 కోట్లతో ఆస్పత్రి అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. దాతలు, ప్రభుత్వ సహకారంతో ఆస్పత్రిలో అన్ని విభాగాలను బలోపేతం చేశామని చెప్పారు. క్యాన్సర్ విభాగంలో రూ. 25 వేలు విలువైన పెట్ స్కాన్ ను అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. మరో వైపు ఎంఆర్ఐ స్కాన్ తోపాటు ఈఎన్టీ విభాగాల్లో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రానికే ప్రభుత్వ వైద్యశాల అపర సంజీవనిగా ఉందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మందులకు కొరత లేదని చెప్పారు. వైద్యులు రోగాన్ని బట్టి ఏవైనా నూతన మందులు ప్రిస్క్రిప్షన్ ఇస్తే వాటిని మరో పది రోజుల్లో తెప్పించేందుకు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు పది జిల్లాల నుంచి గుంటూరు ప్రభుత్వ వైద్యశాలను వస్తుంటారని, వారికి కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. ఆస్పత్రిలో చిన్న చిన్న లోపాలు ఉంటే తమ దృష్టికి ఎప్పుడైనా తీసుకురావచ్చని, వెంటనే సరిదిద్దేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యం

- జిల్లావ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పటిష్టం చేస్తున్నాం
- పగలు, రాత్రి విస్తృత పెట్రోలింగ్..
- అనుమానితులపై నిరంతర నిఘా
- జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్



గుంటూరు, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): జిల్లాలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ సామాన్య ప్రజలకు భద్రత, భరోసా కల్పించడమే లక్ష్యంగా విజిబుల్ పోలీసింగ్‌ను మరింత పటిష్టంగా అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు పగలు, రాత్రి ప్రత్యేక పోలీసు బృందాలతో విస్తృత పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.
ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్లు, వ్యాపార సముదాయాలు, ఆసుపత్రులు, బ్యాంకులు, బస్టాండ్లు, విద్యాసంస్థలు, జనసంచారం అధికంగా ఉండే ప్రాంతాల్లో పోలీసు అధికారులు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ నిఘా కొనసాగిస్తున్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.
గంజాయి రవాణా, మాదకద్రవ్యాల వినియోగం, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. బ్యాంకులు, వ్యాపార సముదాయాల వద్ద దొంగతనాలు, దోపిడీలను నిరోధించడంతో పాటు విద్యాసంస్థల పరిసరాల్లో ఈవ్‌టీజింగ్, ఆకతాయిల వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అల్లర్లు, గొడవలు, కిడ్నాప్‌లు, మానవ అక్రమ రవాణా, అక్రమ నిర్బంధాలు వంటి నేరాలను నియంత్రించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.
జిల్లాలోని కీలక ప్రాంతాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు చేపడుతూ అనుమానిత వాహనాలు, వ్యక్తుల వివరాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి అనుమానితుల కదలికలను పరిశీలిస్తున్నామని, రాత్రి వేళల్లో అనుమానాస్పదంగా సంచరించే వ్యక్తుల వివరాలను సీసీటీఎన్ఎస్, పోలీసు శాఖ డేటాబేస్ ద్వారా తనిఖీ చేసి వారి పూర్వనేర చరిత్రను పరిశీలిస్తున్నట్లు వెల్లడించారు.
గుంటూరు నగరంతో పాటు జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాలను స్వయంగా పరిశీలించిన ఎస్పీ, అవసరమైన చోట అదనపు నిఘా ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే రౌడీషీటర్లు, గంజాయి కేసుల్లో నిందితుల కదలికలపై ఆర్టీజీఎస్, ఏఐ సీసీటీవీ 360 వంటి సాంకేతిక వ్యవస్థల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు. అవసరమైన సందర్భాల్లో డ్రగ్ పరీక్షలు నిర్వహిస్తూ మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.
ప్రజల భద్రతకు విఘాతం కలిగించే విధంగా వ్యవహరించే వారిని, శాంతిభద్రతలకు భంగం కలిగించే వ్యక్తులను, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్పీ హెచ్చరించారు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యమని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, పోలీసు సేవలు నిరంతరం అందుబాటులో ఉంటాయని వకుల్ జిందాల్ భరోసా ఇచ్చారు.

జనగణన ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి



- ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా శిక్షణ పొందాలి
- అధికారులు, సిబ్బందికి కమిషనర్ మయూర్ అశోక్ ఆదేశం

గుంటూరు, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): జనగణన-2027లో భాగంగా రెండో దశలో నిర్వహించనున్న జనాభా గణన ప్రక్రియను గుంటూరు నగరంలో పకడ్బందీగా, సమర్థవంతంగా పూర్తి చేయాలని ప్రిన్సిపల్ సెన్సెస్ అధికారి, నగర కమిషనర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాల్‌లో ఫీల్డ్ ట్రైనర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.
ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, జనవరి 10 నుంచి 24వ తేదీ వం-కు స్వీయ జనగణన (సెల్ఫ్ ఎన్యుమరేషన్)కు అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. జనవరి 25 నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఇంటింటి జనాభా గణన నిర్వహిస్తారని వెల్లడించారు. అనంతరం మార్చి 1 నుంచి 5వ తేదీ వరకు పునఃపరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు.
ప్రస్తుతం శిక్షణ పొందుతున్న ఫీల్డ్ ట్రైనర్లు, తదుపరి దశలో సూపర్‌వైజర్లు, ఎన్యుమరేటర్లకు డిసెంబర్ రెండో వారంలో శిక్షణ అందించాల్సి ఉంటుందని తెలిపారు. జనగణనకు సంబంధించిన ప్రతి అంశంపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వహించేలా సిబ్బందిని సిద్ధం చేయాలని సూచించారు. జనగణన దేశ అభివృద్ధికి అవసరమైన కీలక సమాచారాన్ని సేకరించే ప్రక్రియ అని పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలు, అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఈ గణాంకాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉంటాయని తెలిపారు. అందువల్ల అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం జనగణనను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఐ. కిషోర్, డిప్యూటీ కమిషనర్లు జి. సాంబశివరావు, బి. శ్రీనివాసరావు, సీహెచ్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



బ్రహ్మంగారిమఠం(జర్నలిస్ట్ ఫైల్): కడప జిల్లా బ్రహ్మంగారిమఠం లోని తెలుగంగ జలాశయం అంతర్భాగమైన బ్రహ్మం సాగర్ లో గురువారం నాడు రెండు లక్షల చేప పిల్లలను డిడి నాగయ్య ఏడి సత్యనారాయణ ఎఫ్ డి వో బాలరాజు బ్రహ్మంగారిమఠం మండలం మత్స్యకారుల సంక్షేమ శాఖ అధ్యక్షులు బోల శ్రీనివాసులు చేతుల మీదుగా విడుదల చేశారు ఈ సందర్భంగా డిడి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేసిందని వారి యొక్క సంక్షేమానికి ప్రభుత్వం నిత్యం కృషి చేస్తుందని అందులో భాగంగా బ్రహ్మంగారిమఠం లోని తెలుగు గంగ ప్రాజెక్టు అంతర్భాగమైన బ్రహ్మం సాగర్ లో నేడు రెండు లక్షల చేప పిల్లలను విడుదల చేయడం జరిగిందని వారు తెలిపారు మత్స్య శాఖ అధ్యక్షులు బోల శ్రీనివాసులు మాట్లాడుతూ మాకూటమి ప్రభుత్వం మా మత్స్యకారుల సంక్షేమానికి ఇంతగానో తోడ్పడిందని నేడు ఈ చేప పిల్లల విడుదల ద్వారా బ్రహ్మంగారిమఠం మండల వ్యాప్తంగా ఉన్న మత్స్యకారులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఆయన సంతోషాన్ని వ్యక్తం చేశారు ఈ కార్యక్రమంలో బ్రహ్మంగారిమఠం మత్స్యకారుల సొసైటీ సభ్యులు ఈశ్వరయ్య, రమణయ్య, బోలా చిన్నబ్బి మత్స్యకారులు పాల్గొన్నారు.

మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మహిళా గ్రీవెన్స్ - ఎమ్మెల్యే గళ్ళా మాధవి

- ప్రతి గురువారం అందుబాటులో ఉంటాం: ఎమ్మెల్యే గళ్ళా మాధవి
- మహిళా కార్పొరేటర్లతో కలిసి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్):మహిళల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రతి గురువారం అందుబాటులో ఉంటూ, మహిళా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం (శ్రీనివాసరావుపేట)లో గురువారం ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఎన్డీయే కూటమికి చెందిన నూతన మహిళా కార్పొరేటర్లతో కలిసి మహిళా గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన మహిళల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, వారి నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... మహిళల సమస్యలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి ప్రతి గురువారం నియోజకవర్గ కార్యాలయంలో మహిళా గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని తెలిపారు. మహిళలు తమ సమస్యలను స్వేచ్ఛగా, నిర్భయంగా వచ్చి చెప్పుకునేందుకు ఈ కార్యక్రమం ఒక వేదికగా నిలుస్తోందన్నారు. అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నామని చెప్పారు. ఇటీవల ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన నూతన మహిళా కార్పొరేటర్ల సమక్షంలో ఈసారి గ్రీవెన్స్ నిర్వహించడం ప్రత్యేకతగా పేర్కొన్నారు. మహిళా కార్పొరేటర్లు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడంతో పాటు మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై అవగాహన పెంచుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. మౌలిక వసతుల సమస్యలు, అప్పులు ఇచ్చి మోసపోవడం, దొంగతనాలు, ఉద్యోగ అవకాశాలు, కుటుంబాల్లో వేధింపులు వంటి అనేక సమస్యలతో మహిళలు తమ వద్దకు వస్తున్నారని తెలిపారు. ఇతరులతో చెప్పుకోలేని వ్యక్తిగత సమస్యలను సైతం మహిళలు ఇక్కడ ధైర్యంగా వెల్లడిస్తున్నారని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.
గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో మహిళలు సమస్యల రహితంగా, సంతోషంగా, ఆరోగ్యంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందుతూ తమ కుటుంబాలతో ఆనందంగా జీవించాలన్నదే తమ లక్ష్యమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశీస్సులు, స్ఫూర్తితో మహిళా సంక్షేమం, సాధికారతకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.
ప్రతి గురువారం మహిళా గ్రీవెన్స్ కోసం పశ్చిమ నియోజకవర్గ కార్యాలయం అందుబాటులో ఉంటుందని, మహిళలు తమకు ఎదురయ్యే చిన్న సమస్యనైనా నిర్భయంగా వచ్చి తెలియజేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే గళ్ళా మాధవి కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొని మహిళలకు అండగా నిలిచిన నూతన మహిళా కార్పొరేటర్లు, కూటమి నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

INK OF TRUTH
జర్నలిస్ట్ ఫైల్
తెలుగు దినపత్రిక
జర్నలిస్ట్ ఫైల్ దినపత్రిక చందాదారులుగా చేరాలని అనుకుంటున్నారా?
అయితే ఈ నెంబర్‌కు ఫోన్ చేయండి
సర్క్యులేషన్ మేనేజర్
76 61 80 59 68

ఉద్యోగుల సందడితో కోలాహలంగా కడప ఎన్జీజీవో హోమ్



- రాష్ట్ర నాయకులు విద్యాసాగర్, రమణలకు ఘన స్వాగతం
- ముఖాముఖి కార్యక్రమానికి భారీగా హాజరైన వివిధ శాఖల ఉద్యోగులు

కడప(జర్నలిస్ట్ ఫైల్): కడప ఎన్జీజీవో హోమ్ ఉద్యోగుల సందడితో కోలాహలంగా మారింది. ఏపీఎన్జీజీవోస్ రాష్ట్ర నాయకులు విద్యాసాగర్, రమణ తొలిసారిగా కడప ఎన్జీజీవో హోమ్‌ను సందర్శించిన సందర్భంగా జిల్లా అధ్యక్షుడు బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో జిల్లా సంఘ నాయకులు, ఉద్యోగులు ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎన్జీజీవో హోమ్ పరిసర ప్రాంతాలు వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఉద్యోగుల రాకతో సందడిగా మారాయి. రాష్ట్ర నాయకులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొన్నారు. తమ సమస్యలు, ఉద్యోగ సంబంధిత అంశాలను రాష్ట్ర నాయకుల దృష్టికి తీసుకువచ్చారు.

ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరుకావడం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాష్ట్ర నాయకుల పర్యటనతో జిల్లా ఎన్జీజీవో సంఘంలో నూతన ఉత్సాహం నెలకొంది. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్జీజీవో నాయకులు, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు.

4.52 లక్షల మంది బాలికలకు హెచ్‌పీవీ టీకాలు

- రాష్ట్రవ్యాప్తంగా 87.82 శాతం పంపిణీ పూర్తి
- వైఎస్సార్, నంద్యాల జిల్లాల్లో లక్ష్యానికి మించి టీకాలు

అమరావతి, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): రాష్ట్రంలో 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) టీకాల పంపిణీ కార్యక్రమం 87.82 శాతం పూర్తయింది. రాష్ట్రవ్యాప్తంగా 5,14,984 మంది బాలికలకు టీకాలు వేయాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా, గురువారం సాయంత్రం నాటికి 4,52,275 మందికి టీకాలు అందించారు. ఇంకా 62,709 మందికి టీకాలు వేయాల్సి ఉంది.

జిల్లాల వారీగా టీకాల పంపిణీని పరిశీలిస్తే వైఎస్సార్ జిల్లాలో 105.81 శాతం, నంద్యాల జిల్లాలో 100.40 శాతం నమోదై నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాయి. మార్కాపురం జిల్లాలో 99.16 శాతం, పల్నాడు జిల్లాలో 98.74 శాతం, కర్నూలులో 94.28 శాతం, శ్రీ సత్యసాయి జిల్లాలో 93.61 శాతం, తిరుపతిలో 93.22 శాతం టీకాల పంపిణీ పూర్తయింది.

ఇక మరో 15 జిల్లాల్లో 80 శాతానికి పైగా టీకాలు పంపిణీ చేశారు. అత్యల్పంగా పోలవరం జిల్లాలో 63.32 శాతం, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 65.43 శాతం నమోదయ్యాయి. మిగిలిన బాలికలకు కూడా త్వరితగతిన టీకాలు అందించి లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలి

- అనంతపురం జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశం

అమరావతి,నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): అనంతపురం జిల్లా రాప్తాడు మండలం రామనేపల్లి సమీపంలో ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తాపడిన ఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌ను ఆదేశించారు.

బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు రామనేపల్లి సమీపంలో ప్రమాదానికి గురైన నేపథ్యంలో క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించాలని సూచించారు. బాధితులకు అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించి, మెరుగైన చికిత్స అందేలా వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

తెనాలి ఎంపీపీగా కొడాలి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం



తెనాలి, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): తెనాలి మండల పరిషత్ అధ్యక్షుడిగా (ఎంపీపీ) కొడాలి శ్రీనివాసరావు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ దుర్గాబాయి ఆయనతో ప్రమాణం చేయించారు.

ఈ సందర్భంగా దుర్గాబాయి మాట్లాడుతూ, నూతన ఎంపీపీగా బాధ్యతలు చేపట్టిన కొడాలి శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. మండల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీరు, పారిశుధ్యం, రహదారులు, విద్య, వైద్య రంగాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు.

అనంతరం కొడాలి శ్రీనివాసరావు మాట్లాడుతూ, తనపై నమ్మకంతో ఎంపీపీ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కృషి చేస్తానని చెప్పారు. ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అత్తోట దీప్తి, అధికారులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, హెచ్‌సీవీ ఛానల్ అధినేత కరణం వెంకటేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు శాఖమూరి నారాయణ ప్రసాద్, మాజీ ఎంపీపీ వెంకట్రావు, కావూరి చంద్రమోహన్, నూతన ఎంపీటీసీ సభ్యులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పాల్గొని కొడాలి శ్రీనివాసరావుకు అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో తెనాలి మండల అభివృద్ధి కార్యక్రమాలు మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు.

సమన్వయంతో పనిచేస్తూ మండలాల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలి : మంత్రి దుర్గేష్

- పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల నూతన ఎంపీటీసీల ప్రమాణ స్వీకారోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రివర్యులు కందుల దుర్గేష్
- నూతన ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నిక కార్యక్రమానికి మంత్రి దుర్గేష్ హాజరు..ఎన్నికైన ప్రజాప్రతినిధులకు ధృవీకరణ పత్రాలు అందజేసి అభినందనలు తెలిపిన మంత్రి దుర్గేష్
- 'అమరజీవి జలధార' పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఇంటింటికీ గోదావరి జలాలు అందించాలని దిశానిర్దేశం
- పదవులు అలంకారం కాదు.. ప్రజాసేవకు బాధ్యత: మంత్రి కందుల దుర్గేష్



నిడదవోలు, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): పదవులు అలంకారం కాదు.. ప్రజాసేవకు బాధ్యత అని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.. గురువారం నిడదవోలు నియోజకవర్గ పరిధిలోని పెరవలి, ఉండ్రాజవరం, నిడదవోలు మండలాల్లో నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా మండల పరిషత్ కార్యాలయాల్లో జరిగిన కార్యక్రమాలకు స్వయంగా హాజరైన మంత్రి దుర్గేష్ ప్రజామోదంతో ఎన్నికైన ప్రతి సభ్యుడిని ఆప్యాయంగా పలకరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా పెరవలి మండల నూతన ఎంపీపీగా ఎన్నికైన దాసం నరసవేణి, వైస్ ఎంపీపీ అక్కిన నాగమణికి, ఉండ్రాజవరం ఎంపీపీ చిట్టూరి సూర్యనారాయణ, వైస్ ఎంపీపీ కాపకాయల కుమారికి, నిడదవోలు మండల ఎంపీపీ చదలవాడ నతానియేలు రాజు, వైస్ ఎంపీపీ కొప్పిరెడ్డి గాయత్రీదేవిలకు ఎన్నికల ధృవీకరణ పత్రాలను అందజేసి అభినందించారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎంపీటీసీలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీలను ఉద్దేశించి ప్రసంగిస్తూ కీలక సూచనలు చేశారు..రాజకీయాలు కేవలం ఎన్నికల వరకే పరిమితం కావాలని, ఆ తర్వాత పార్టీలకు అతీతంగా ప్రజాసేవకే జీవితాన్ని అంకితం చేయాలని సూచించారు. ప్రజలు ఎంతో నమ్మకంతో కట్టబెట్టిన ఈ పదవులను బాధ్యతగా స్వీకరించి, వారి ఆశయాలకు అనుగుణంగా పనిచేయాలన్నారు.

ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేరువ చేయాలి

గత రెండున్నరేళ్లలో కూటమి ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలు అర్హులైన ప్రతి పేదవాడికి అందేలా స్థానిక నాయకులు చొరవ చూపాలని పిలుపునిచ్చారు. గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని, అధికారులతో సమన్వయం చేసుకుంటూ వాటిని తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటిస్తూ ఆదర్శ గ్రామాల నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ప్రత్యేకించి గ్రామాల్లో, మండలాల్లో పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ, అంతర్గత రహదారుల వంటి కనీస మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని సూచించారు. సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని దిశానిర్దేశం చేశారు..గెలిచిన తర్వాత నాయకులు ప్రజలకు దూరంగా ఉండకూడదని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నప్పుడే నిజమైన ప్రజాప్రతినిధులుగా గుర్తింపు లభిస్తుందని హితవు పలికారు.

అమరజీవి జలధార పనుల వేగవంతం: ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పెరవలి మండలంలో శంకుస్థాపన చేసిన 'అమరజీవి జలధార' కార్యక్రమ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి దుర్గేష్ తెలిపారు. తద్వారా ప్రజలందరికీ ఇంటింటికీ శుద్ధి చేసిన సురక్షిత గోదావరి మంచినీటిని అందించేలా యుద్ధ ప్రాతిపదికన కృషి చేయాలన్నారు.

మహిళా సాధికారతకు పెద్దపీట: ప్రధాని నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ల నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం మహిళలకు ప్రజాప్రతినిధులుగా అత్యధిక అవకాశాలు కల్పించి మహిళా సాధికారతకు పెద్దపీట వేసిందని, ఇందుకు నిదర్శనంగా పెరవలి మండల ఎంపీపీ, వైస్ ఎంపీపీ పదవుల రెండింటిలోనూ మహిళలే ఎన్నిక కావడం గమనార్హమని మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మూడు మండలాల్లో ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా జరగడానికి సహకరించిన ఎన్నికల అధికారులకు, పోలీసు యంత్రాంగానికి మంత్రి దుర్గేష్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అంతకుముందు కార్యక్రమాలకు విచ్చేసిన మంత్రి కందుల దుర్గేష్‌కు కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు.

కార్యక్రమం చివరలో నూతనంగా ఎన్నికైన ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులతో మంత్రి దుర్గేష్ గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమాల్లో ఆయా మండలాల ఎంపీడీవోలు, ఇతర ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి జాతీయ స్థాయిలో చర్యలు తీసుకోవాలి

- ఎన్‌పీఎస్, సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి



కలకత్తా, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): దేశవ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరినీ పాత పెన్షన్ విధానంలోకి తీసుకురావాలని, నూతన పెన్షన్ విధానం (ఎన్‌పీఎస్), కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేయాలని అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సమాఖ్య వైస్ ప్రెసిడెంట్ నలమారు చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. నవంబర్ 19న కలకత్తాలో జరిగిన సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో ఆయన వివిధ రాష్ట్రాల ఉద్యోగులు, పెన్షనర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావిస్తూ పలు డిమాండ్లను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోవిడ్ సమయంలో నిలిపివేసిన 18 నెలల డియర్‌నెస్ రిలీఫ్ (డీఆర్)ను వెంటనే విడుదల చేయాలని కోరారు. పెన్షన్ వాలిడేషన్ యాక్ట్--2025ను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల్లో కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని సూచించారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులందరికీ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అన్ని రాష్ట్రాల్లో పీఆర్సీ కమిషన్లను సకాలంలో నియమించి, వాటి సిఫార్సులను వెంటనే అమలు చేయాలని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం డీఏ ప్రకటించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా డీఏను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీనియర్ సిటిజన్లకు రైళ్లు, విమాన ప్రయాణాల్లో గతంలో కల్పించిన రాయితీలను పునరుద్ధరించాలని, ప్రభుత్వాల నుంచి పెన్షనర్లకు రావాల్సిన బకాయిలను ప్రత్యేక కేసులుగా పరిగణించి తక్షణమే చెల్లించాలని కోరారు. హర్యానా రాష్ట్ర ప్రభుత్వం మాదిరిగా ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు కూడా పెన్షనర్లకు నాలుగేళ్లకు ఒకసారి ఎల్‌టీసీ సౌకర్యం కల్పించాలని సూచించారు. అన్ని రాష్ట్రాల్లో పెన్షనర్లకు నగదు రహిత వైద్య చికిత్స (క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్) అందించాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను వెంటనే భర్తీ చేయాలని నలమారు చంద్రశేఖర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరారు.

బిజెపి మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవికి బి-ఫామ్ అందజేత



రాజమహేంద్రవరం, నవంబర్ 19 (జర్నలిస్ట్ ఫైల్): ఈనెల 26న జరిగే కార్పొరేషన్ ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేస్తున్న బిజెపి మేయర్ అభ్యర్థి రేలంగి శ్రీదేవికి బిజెపి జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర గురువారం ఉదయం బి ఫామ్ అందజేసారు. బిజెపి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయ సూచన మేరకు సిగ్నేచర్ అథారిటీ ప్రకారం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బొల్లిన నిర్మల కిషోర్ సంతకంతో కూడిన బిఫామ్ అందజేసారు. అలాగే బిజెపి తరపున బరిలో నిలిచిన కార్పొరేటర్ అభ్యర్థులు కందుకూరి మనోజ్ (17వ వార్డు), బత్తిన సుధారాణి (26వ వార్డు), కురగంటి ఈశ్వరి (32వ వార్డు), క్షత్రియ బాలసుబ్రహ్మణ్యం సింగ్ (35వ వార్డు), కాలెపు కుసుమ(47వ వార్డు)కూడా బి ఫామ్స్ అందుకున్నారు.

ఆర్టీసీలో గుత్తేదారుల దోపిడీకి అడుకట్ట వేయాలి

- ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై రాష్ట్రవ్యాప్త విచారణ జరపాలి
- ఏఐటీయూసీ నేతల డిమాండ్.. జేఎండీకి వినతిపత్రం అందజేత



విజయవాడ, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): ఏపీఎస్ఆర్టీసీలో ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించి, గుత్తేదారుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ పరిధిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత తదితర సమస్యలపై ప్రత్యేక విచారణ జరిపించాలని కోరారు.

రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 129 డిపోలు, నాలుగు జోనల్ వర్క్‌షాప్‌లు, ప్రధాన బస్టాండ్లు, ఆసుపత్రులు, స్టోర్స్, టైర్ షాపులు తదితర విభాగాల్లో 8,500 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ కార్మికులు పనిచేస్తున్నారని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్. వెంకటసుబ్బయ్య, ఏపీఎస్ఆర్టీసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి టి. గంగాంజనేయులు తెలిపారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ ప్రతినిధులతో కలిసి ఆర్టీసీ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ శివప్రసాద్‌ను కలిసి కార్మికుల సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, గుత్తేదారులు కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో నగదు మినహాయిస్తున్నప్పటికీ సంబంధిత ఖాతాల్లో సక్రమంగా జమ చేయడం లేదని ఆరోపించారు. వేతనాలు సకాలంలో చెల్లించకపోవడం, వేతనాల్లో వ్యత్యాసాలు, బ్యాంకు ఖాతాల నిర్వహణలో జోక్యం చేసుకోవడం, ఏటీఎం కార్డులు, బ్యాంకు పాస్‌పుస్తకాలను గుత్తేదారులు తమ ఆధీనంలో ఉంచుకోవడం వంటి చర్యలతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంతో పాటు ఆర్టీసీ యాజమాన్యంపై ఉందన్నారు. గుత్తేదారుల అక్రమాలకు అడ్డుకట్ట వేసి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు ఏఐటీయూసీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

దాసరి కిరణ్ కుమార్ మాట్లాడుతూ, థర్డ్ పార్టీ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి ఔట్‌సోర్సింగ్ కార్మికులను ఏపీకాన్ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ యాజమాన్యమే నేరుగా కార్మికుల బ్యాంకు ఖాతాల్లో వేతనాలు జమ చేయాలని, ప్రతి నెలా పదో తేదీలోపు చెల్లింపులు పూర్తి చేయాలని కోరారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో సమానంగా వేతనాలు, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. విద్యుత్ బస్సుల నిర్వహణ నేపథ్యంలో విధుల నుంచి తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, మహిళా కార్మికులకు చట్టబద్ధమైన ప్రసూతి సెలవులు, ఓవర్‌టైమ్ వేతనాలు, వారాంతపు సెలవులు, జాతీయ, రాష్ట్ర పండుగ సెలవులు అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు.

టి. గంగాంజనేయులు మాట్లాడుతూ, ఔట్‌సోర్సింగ్ కార్మికులందరికీ ఆర్టీసీ వైద్య సదుపాయాలు, జీవిత బీమా, ఉచిత బస్సు పాస్‌లు కల్పించాలని కోరారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లను స్కిల్డ్ కేటగిరీగా గుర్తించి తగిన వేతనాలు చెల్లించాలని, ఒక రోజు సెలవుకు రెండు రోజుల వేతనం కోత విధించే విధానాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా అన్ని డిపోలు, వర్క్‌షాప్‌లు, బస్టాండ్లు, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలపై సమగ్ర విచారణ నిర్వహించి, అక్రమాలకు పాల్పడుతున్న గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల బాజీ, ఉపాధ్యక్షుడు పాతిన మధుసూదన్ రావు, కార్యదర్శి మహమ్మద్ హనీఫ్, ప్రచార కార్యదర్శి అనకాపల్లి అశోక్, కోశాధికారి ప్రసాద్ కుమార్, నాయకులు అశోక్, అప్పలరాజు, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎన్జీవోస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ శిబిరం విజయవంతం

- 504 మంది మహిళా ఉద్యోగులకు ఉచిత వైద్య పరీక్షలు
- 45 మందికి ప్రాథమిక పరీక్షల్లో పాజిటివ్.. తగిన వైద్య సూచనలు



గుంటూరు, నవంబర్ 19(జర్నలిస్ట్ ఫైల్): మహిళా ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. నవంబర్ 16 నుంచి 19వ తేదీ వరకు గుంటూరులోని ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి (జీజీహెచ్), నాట్కో క్యాన్సర్ సెంటర్ ప్రాంగణంలో నిర్వహించిన ఈ శిబిరంలో మొత్తం 504 మంది మహిళా ఉద్యోగులకు గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పరీక్షల్లో 45 మందికి ప్రాథమికంగా పాజిటివ్ ఫలితాలు రావడంతో వారికి వైద్య నిపుణులు తగిన సూచనలు, సలహాలు అందించి తదుపరి వైద్య పరీక్షలు, చికిత్సకు సంబంధించిన మార్గదర్శకత్వం కల్పించారు.

30 నుంచి 65 సంవత్సరాల వయస్సు గల మహిళా ఉద్యోగులకు ఉచితంగా ఈ పరీక్షలు నిర్వహించారు. మహిళల్లో క్యాన్సర్ వ్యాధులపై అవగాహన పెంపొందించడం, వ్యాధులను ప్రాథమికదశలోనే గుర్తించి సకాలంలో వైద్య సేవలు పొందేలా ప్రోత్సహించడం ఈ శిబిరం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు.

శిబిరం విజయవంతం కావడంలో ఏపీఎన్జీవోస్ మహిళా నాయకులు చేసిన కృషి, అంకితభావం అభినందనీయమని జిల్లా అధ్యక్షుడు గంటసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. తాజున్నిసా ఆధ్వర్యంలో మహిళా నాయకులు సమన్వయంతో పనిచేస్తూ పెద్ద సంఖ్యలో మహిళా ఉద్యోగులను శిబిరంలో భాగస్వాములను చేయడంలో కీలక పాత్ర పోషించారని ప్రశంసించారు.

అమెరికాకు చెందిన పింక్ ఆర్గనైజేషన్ ద్వారా వచ్చిన వైద్య నిపుణులు డాక్టర్ సమత కడియాల, డాక్టర్ కరూర్ హబాక్, డాక్టర్ మెరిస్సా మిస్‌కాల్, వారి వైద్య బృందం అందించిన సేవలను సంఘం నాయకులు అభినందించి ఘనంగా సత్కరించారు. ప్రివెంటివ్ ఆంకాలజీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ మూహసీనా, రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ అనిల్ కుమార్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమానికి మొదటి నుంచి సహకారం అందించిన జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాప్రసాద్, నాట్కో క్యాన్సర్ సెంటర్ కోఆర్డినేటర్ అశోక్ కుమార్‌లకు నిర్వాహకులు ధన్యవాదాలు తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంటసాల శ్రీనివాసరావు, కార్యదర్శి ఆరాధ్యుల శ్యామ్ సుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, గుంటూరు నగర అధ్యక్షుడు చింతల కళ్యాణ్ కుమార్, నగర కార్యదర్శి జె.వి. కోటేశ్వరరావు తదితరులు శిబిరం విజయవంతానికి కృషి చేసిన మహిళా నాయకులు, నిర్వాహకులను అభినందించారు.

మహిళా ఉద్యోగుల ఆరోగ్యమే సమాజ ఆరోగ్యమని, ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల ఆరోగ్య పరిరక్షణకు కూడా ఏపీఎన్జీవోస్ అసోసియేషన్ కట్టుబడి ఉందని, భవిష్యత్తులోనూ మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని వెల్లడించారు.

Owned, Edited & Published by D.Ajay. Published from 126-352, 4Th Lane, Kodandarama Nagar, Gorlavaripalem Road, Gorantla, Guntur-522034 (A.P).
Printed by C.Sridhar Reddy at Teja Cards and Stationery, Shop no.1, 22-11-170, T.V Street, Lalapet,Guntur-522003(A.P.). Editor : D.Ajay. Phones: 7661805968, 9966319999. Email: dasariajjay@gmail.com